J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS



సంపుటి

సంపుటి : 46 సంచిక : 25 20.11.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

విస్తరణా..? ప్రక్షాళనా..?

ఆశల పల్లకిలో ఆశావహులు!

- ఏపీ మంత్రివర్గంలో త్వరలో భారీ మార్పులు
- చంద్రబాబు కరుణాకటాక్షాల కోసం ఎదురుచూస్తున్న నేతలు
- కొందరికి ప్రమోషన్లు.. మరికొందరికి డిమోషన్లు
- కేంద్ర మంత్రివర్గ విస్తరణపైనా రాజకీయవర్గాల్లో చర్చ

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరో కీలక ఘట్టానికి తెరలేవబోతోందా? ఎన్నికల సమరంలో విజయాలు సాధించి అధికార పీఠాన్ని అధిరోహించిన కూటమి నేతలకు ఇప్పుడు మంత్రివర్గంలో చోటు దక్కించుకోవడమే తదుపరి లక్ష్యంగా మారిందా? రెండున్నరేళ్ల పాలన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు తన టీమ్‌ను మార్చేందుకు సిద్ధమవుతున్నారా? పనితీరే ప్రామాణికంగా మంత్రులకు ప్రమోషన్లు, మరికొందరికి ఉద్వాసనలు పలకనున్నారా? ఇటు రాష్ట్ర మంత్రివర్గంతో పాటు అటు కేంద్ర కేబినెట్‌లోనూ మార్పులుంటాయనే ప్రచారం ఆశావహుల గుండెల్లో గుబులు రేపుతోంది.



ఆంధ్రప్రదేశ్‌లో ఎత్తుకు పైఎత్తులతో సాగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల సమరం ముగింపు దశకు చేరుకుంటోంది. చివరిదైన పల్లెపోరులోనూ పట్టు సాధించేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు వ్యూహాలకు పదునుపెడుతున్నాయి. ఇప్పటికే సుమారు 20 శాతం సర్పంచ్ స్థానాలను ఏకగ్రీవం చేసుకునే దిశగా కూటమి నేతలు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. మరోవైపు మున్సిపల్, పరిషత్ ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు సాధించలేకపోయిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామీణ పోరులోనైనా తన ఉనికిని చాటుకునేందుకు శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తోంది. అయితే స్థానిక ఎన్నికల సందడి ముగుస్తున్న కొద్దీ అధికార కూటమిలో మరో కొత్త సమీకరణం తెరపైకి వస్తోంది. తమ తమ ప్రాంతాల్లో పార్టీ విజయానికి కృషి చేశామని, ప్రత్యర్థులకు అవకాశం ఇవ్వకుండా మెజారిటీ స్థానాలను కైవసం చేసుకున్నామని చెప్తూ పలువురు నేతలు అధిష్టానానికి నివేదికలు అందిస్తున్నట్లు సమాచారం. ఇంటెలిజెన్స్ వర్గాలు, పార్టీ అంతర్గత నివేదికల ఆధారంగా ఎవరు పనితీరు కనబరిచారు? ఎవరు విఫలమయ్యారు? అన్న లెక్కలు కూడా సిద్ధమవుతున్నాయనే ప్రచారం జోరుగా సాగుతోంది.

ఈ నేపథ్యంలో త్వరలోనే రాష్ట్ర మంత్రివర్గంలో భారీ మార్పులు చోటుచేసుకుంటాయనే ఊహాగానాలు రాజకీయ వర్గాల్లో ఊపందుకున్నాయి. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం పనిచేసిన వారికి అమాత్యయోగం కల్పిస్తారని, పనితీరు నిరూపించుకోలేని వారికి ఉద్వాసన తప్పదని వినిపిస్తున్న వార్తలు ఆశావహుల్లో కొత్త ఆశలు రేకెత్తిస్తున్నాయి. ఎవరికి ప్రమోషన్? ఎవరికి డిమోషన్? ఎవరు అందలం ఎక్కుతారు? ఎవరి పదవికి ఎసరు వస్తుంది?

2లో



ఆశల పల్లకిలో ఆశావహులు!

(మొదటిపేజీ తరువాయి)

అన్న చర్చ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. ఇదే సమయంలో కేంద్ర మంత్రివర్గంలోనూ మార్పులుంటాయనే ప్రచారం, చంద్రబాబు తాజా ఢిల్లీ పర్యటనకు రాజకీయ ప్రాధాన్యతను సంతరిస్తోంది.

కోటి ఆశలతో మొదలైన పాలన.. ఇప్పుడు కొత్త కూర్పుపై కసరత్తు!

ఐదేళ్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనకు ముగింపు పలుకుతూ 164 స్థానాలతో ఘనవిజయం సాధించిన టీడీపీ నేతృత్వంలోని కూటమి 2024 జూన్ 12న అధికార పగ్గాలు చేపట్టింది. ముఖ్యమంత్రిగా చంద్ర బాబు బాధ్యతలు స్వీకరించగా, ఆయనతో పాటు 24 మంది మంత్రులతో తొలి మంత్రివర్గం కొలువు దీరింది. ఇందులో తెలుగుదేశం పార్టీకి 20, జన సేనకు మూడు, బీజేపీకి ఒక మంత్రి పదవి దక్కింది.

అయితే, మంత్రి పదవులపై ఆశలు పెట్టుకున్న నేతల సంఖ్య మాత్రం ఈ కేటాయింపులకు మించి ఉండటంతో చాలామందికి నిరాశే ఎదురైంది. ముఖ్యంగా సీనియర్ ఎమ్మెల్యేలు, గతంలో పార్టీ కోసం కష్టపడిన నాయకులు తమకు అవకాశం దక్కకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అప్పట్లో వారిని బుజ్జగించే క్రమంలో చంద్రబాబు, లోకేష్ రెండో విడతలో అవకాశం కల్పిస్తామని పలువురికి హామీ ఇచ్చినట్లు ప్రచారం జరిగింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రెండున్నరేళ్ల పాలనను పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఆ హామీలను అమలు చేయాలంటూ ఆశావహులు అధిష్టానంపై ఒత్తిడి పెంచుతున్నట్లు తెలుస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లోనే కాకుండా స్థానిక ఎన్నికల్లోనూ పార్టీ విజయానికి శ్రమించామని, అయినప్పటికీ మంత్రి వర్గంలో చోటు దక్కకపోతే తమ రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుందని కొందరు నేతలు వాదిస్తున్నట్లు సమాచారం. మరోవైపు ప్రభుత్వం తన ఐదేళ్ల పదవీ కాలంలో సగానికి చేరువవుతున్న తరుణంలో మంత్రి వర్గ మార్పులపై నిర్ణయం తీసుకోవడం సముచితమని చంద్రబాబు భావిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. మరో ఏడాదిన్నరలో ఎన్నికల వాతా వరణం మొదలయ్యే అవకాశం ఉండటంతో, 2029 లక్ష్యంగా కొత్త టీమ్‌ను సిద్ధం చేయాలన్న ఆలోచనలో ముఖ్యమంత్రి ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో తడ నుంచి ఇచ్చాపురం వరకు అనేకమంది నేతలు అమాత్య పదవిపై ఆశలుపెట్టుకుని అధిష్టానం నిర్ణయం కోసం ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

ఆశావహుల జాబితా.. చాంతాడంత!

మూడు పార్టీల కలయికతో ఏర్పడిన కూటమి ప్రభుత్వంలో తెలుగుదేశం పార్టీ ప్రధాన భాగస్వామిగా కొనసాగుతోంది. అయితే కూటమి ధర్మంలో భాగంగా పలు నియోజకవర్గాలను మిత్రపక్షాలకు కేటాయించ డంతో టీడీపీలోని కొందరు నేతలు అసంతృప్తితో ఉన్నారు. టికెట్లు దక్కని వారి అసంతృప్తికి ఇప్పుడు మంత్రి పదవులు ఆశిస్తున్న నాయకుల నిరీక్షణ కూడా తోడవడంతో పార్టీలో అంతర్గతంగా కొత్త సమీకరణలు మొదలయ్యాయి. ఈ పరిస్థితిని చక్కదిద్దడంతో పాటు పార్టీకి విధేయంగా పనిచేసే నాయకులకు ప్రాధాన్యత కల్పించేలా చంద్రబాబు కసరత్తు చేస్తున్నట్లు తెలు స్తోంది. ప్రత్యర్థులను రాజకీయంగా ఎదుర్కొనే సామర్థ్యం, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే నేర్పు, ప్రజాదరణ, వ్యక్తిగత ప్రతిష్ఠ, వివాదరహితమైన నేపథ్యం, పార్టీ పట్ల విధేయత వంటి అంశాలను ప్రాతిపదికగా తీసుకుని కొత్త మంత్రుల ఎంపిక జరగ వచ్చని సమాచారం. వీటికి తోడు సామాజిక, ప్రాం తీయ సమీకరణలకూ పెద్దపీట వేయనున్నట్లు తెలు స్తోంది. జనసేన అధినేత పవన్ కల్యాణ్, బీజేపీ అధిష్టానం కూడా తమ పార్టీల్లో చాలాకాలంగా అవ కాశాల కోసం ఎదురుచూస్తున్న సీనియర్లకు న్యాయం చేయాలని భావిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. దీంతో మూడు పార్టీల్లోనూ ఆశావహుల ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి.

టీడీపీ నుంచి కూడా ఆశావహుల జాబితా భారీ గానే కనిపిస్తోంది. రాయలసీమ కోటాలో పులివెందుల రాజకీయాల్లో వైసీపీకి గట్టి సవాల్ విసురుతున్న బీటెక్ రవికి ఈసారి మంత్రి పదవి దక్కవచ్చనే ప్రచారం ఉంది. కడపకు చెందిన మాధవిరెడ్డి కూడా ఈ రేసులో బలమైన పోటీదారుగా కనిపిస్తున్నారు. నెల్లూరు జిల్లా నుంచి కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పేరు ప్రము ఖంగా వినిపిస్తోంది. ఆమెతో పాటు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కూడా మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. తిరుపతి జిల్లాకు ఇప్పటివరకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేకపోవ డంతో ఈసారి తమ ప్రాంతానికి అవకాశం కల్పించా లని అక్కడి నేతలు పట్టుబడుతున్నట్లు సమాచారం.

ఉత్తరాంధ్ర నుంచి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు బీసీ కోటాలో తన ప్రయత్నాలు సాగి స్తుండగా, బెందాళం అశోక్, పితాని సత్యనారాయణ, విజయనగరానికి చెందిన కళా వెంకట్రావు సీనియారిటీ ప్రాతిపదికన అవకాశాన్ని ఆశిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇక గోరంట్ల బుచ్చయ్య చౌదరి, సుజనా చౌదరి, నిమ్మకాయల చినరాజప్ప, మండలి బుద్ధ ప్రసాద్, కన్నా లక్ష్మీనారాయణ, యరపతినేని శ్రీనివాస్, గంటా శ్రీనివాసరావు, తోట త్రిమూర్తులు, ఆమంచి కృష్ణమోహన్, సీఎం రమేష్ వంటి నాయకుల పేర్లు కూడా రాజకీయ చర్చల్లో వినిపిస్తున్నాయి. సామాజిక సమీకరణలు, ప్రాంతీయ ప్రాధాన్యతలు, సీనియారిటీ ఆధారంగా వీరిలో కొందరికి అవకాశం దక్కవచ్చనే అంచనాలు ఉన్నాయి. జనసేన నుంచి కొణతాల రామకృష్ణ వంటి సీనియర్ నాయకుల పేర్లు వినిపిస్తుం డగా, బీజేపీ నుంచి కామినేని శ్రీనివాస్ వంటి నేతలు కూడా మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నట్లు రాజకీయ వర్గాల సమాచారం.

ఉద్వాసన తప్పదా..? డేంజర్ జోన్‌లో ఎవరెవరు?

కొత్తవారికి అవకాశం కల్పించాలంటే ప్రస్తుతం మంత్రులుగా కొనసాగుతున్న కొందరికి ఉద్వాసన తప్పకపోవచ్చు. అందుకే మంత్రివర్గ విస్తరణ కంటే ప్రక్షాళనపైనే ఎక్కువ చర్చ జరుగుతోంది. ముఖ్యంగా తొలిసారి ఎమ్మెల్యేలుగా గెలిచి మంత్రి పదవులు చేపట్టిన కొందరు తమ శాఖల నిర్వహణలో ఆశించిన స్థాయిలో పనితీరు కనబరచలేకపోతున్నారనే విమ ర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మొత్తం మంత్రివర్గంలో ఎనిమిది నుంచి పది స్థానాల వరకు మార్పులు ఉండవచ్చని, వీటిలో కొందరికి శాఖలు మార్చి మరికొందరిని పూర్తిగా తప్పించే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ ఊహాగానాల్లో వాసంశెట్టి సుభాష్, గుమ్మడి సంధ్యారాణి, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, ఎస్. సవిత, అనిత, కందుల దుర్గేష్ వంటి వారి పేర్లు వినిపిస్తున్నాయి.

నెల్లూరు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు మంత్రుల్లో ఒకరికి ఉద్వాసన తప్పకపోవచ్చనే ప్రచారం కూడా స్థానిక రాజకీయాల్లో చర్చనీయాం శంగా మారింది. రాయలసీమ, పల్నాడు ప్రాంతాలకు కొత్తగా మంత్రివర్గంలో ప్రాతినిధ్యం కల్పించే అవకా శాలు ఉన్నాయనే అంచనాలు వినిపిస్తున్నాయి. జన సేనకు చెందిన కందుల దుర్గేష్‌ను తప్పించి, ఆ పార్టీకి మరో మంత్రి పదవి కేటాయించవచ్చనే ప్రచారం కూడా ఉంది. బీజేపీ నుంచి సత్యకుమార్‌తో పాటు మరో నేతకు అవకాశం కల్పించవచ్చని అంటున్నారు. మరోవైపు కమ్మ సామాజికవర్గానికి చెందిన లోకేష్, పయ్యావుల కేశవ్, గొట్టిపాటి రవికుమార్ ప్రస్తుతం మంత్రివర్గంలో కొనసాగుతున్నారు. వీరితో పాటు పార్టీలోని ఇతర కీలక నేతలకూ సముచిత బాధ్యతలు అప్పగించే దిశగా అధిష్టానం ఆలోచిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. గొట్టిపాటి రవికుమార్ స్థానంలో గోరంట్ల బుచ్చయ్య చౌదరికి అవకాశం కల్పించవచ్చనే ఊహా గానాలు వినిపిస్తున్నాయి. అలాగే అచ్చెన్నాయుడికి పార్టీ బాధ్యతలు అప్పగించి, ఆయన స్థానంలో సుజనా చౌదరికి అవకాశం కల్పించవచ్చని, హోంమంత్రి అనిత స్థానంలో అదే సామాజికవర్గానికి చెందిన మరో నేతకు అవకాశం దక్కవచ్చని కూడా రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది. స్థానిక ఎన్నికల్లో మంత్రుల పని తీరు, వారి నియోజకవర్గాల్లో పార్టీ సాధించిన ఫలి తాలు కూడా ఈ మార్పులకు ప్రాతిపదిక కావచ్చని భావిస్తున్నారు. ఇక కొందరు సీనియర్ ఎమ్మెల్యేలు వచ్చే ఎన్నికల నాటికి ప్రత్యక్ష రాజకీయాల నుంచి తప్పుకుని తమ వారసులకు నియోజకవర్గ బాధ్యతలు అప్పగించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో చివరి దశలోనైనా మంత్రి పదవి చేపట్టి తమ రాజకీయ ప్రస్థానానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చు కోవాలని వారు ఆరాటపడుతున్నట్లు సమాచారం.

కేంద్ర కేబినెట్ విస్తరణపైనా ఆశలు!

రాష్ట్ర మంత్రివర్గ మార్పులపై చర్చ జరుగుతున్న సమయంలోనే కేంద్ర కేబినెట్‌లోనూ మార్పులు చోటు చేసుకోవచ్చనే ప్రచారం కూటమి నేతల్లో కొత్త ఆశలు రేకెత్తిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల ఢిల్లీ పర్యటనకు వెళ్లి కేంద్ర మంత్రులు, బీజేపీ అగ్రనేతలతో సమావేశం కావడం ఈ చర్చకు మరింత ఊతమి చ్చింది. రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ ప్రాజె క్టులు, ఆర్థిక సహాయం, రైతులకు పరిహారం, తుపాను నష్టాలపై కేంద్రం నుంచి సహకారం కోరడంతో పాటు, డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల అంశాలపై కూడా చర్చించినట్లు సమాచారం.

అయితే ఈ పర్యటనలో కేంద్ర మంత్రివర్గ విస్తరణ అంశం కూడా చర్చకు వచ్చిందా? అన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరమైన ప్రశ్నగా మారింది. ఎన్డీయే కూటమిలో తెలుగుదేశం పార్టీ కీలక భాగస్వామిగా ఉన్న నేపథ్యంలో కేంద్ర మంత్రివర్గంలో మరో బెర్త్ కేటాయించే అవకాశాలున్నాయని ప్రచారం సాగు తోంది. అదే జరిగితే ఆ పదవి ఎవరికి దక్కుతుంది? రాష్ట్రం నుంచి ఇప్పటికే కేంద్ర మంత్రులుగా ఉన్న వారితో పాటు కొత్తగా ఎవరికి అవకాశం లభి స్తుంది? అన్నది ఆసక్తికరంగా మారింది. కేంద్ర నాయ కత్వం, చంద్రబాబు మధ్య ఈ అంశంపై చర్చ జరి గిందనే ఊహాగానాలు ఆశావహుల్లో ఉత్కంఠను పెంచుతున్నాయి.

ఆశల పల్లకిలో నేతలు.. అధిష్టానం నిర్ణయం ఎప్పుడో?

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల హడావుడి ముగింపు దశకు చేరుకుంటుండగా, అధికార కూట మిలో మాత్రం మంత్రి పదవుల కోసం కొత్త రాజకీయ పోరు మొదలైంది. ఇప్పటివరకు పార్టీ కోసం పనిచేసిన నేతలు తమకు తగిన గుర్తింపు లభిస్తుందని ఆశిస్తు న్నారు. సీనియర్లు తమ అనుభవానికి విలువ దక్కు తుందని ఎదురుచూస్తుంటే, కొత్తతరం నాయకులు తమ పనితీరుతో అధిష్టానం దృష్టిని ఆకర్షించాలని ప్రయత్ని స్తున్నారు. అయితే చంద్రబాబు నిర్ణయం ఎలా ఉండ బోతోంది? కేవలం మంత్రివర్గాన్ని విస్తరిస్తారా? లేక పనితీరు ఆధారంగా సమూల ప్రక్షాళనకు శ్రీకారం చుడతారా? మిత్రపక్షాల ఒత్తిళ్లకు ఎంతవరకు ప్రాధా న్యత ఇస్తారు? సామాజిక, ప్రాంతీయ సమీకరణాలకు ఎలాంటి ప్రాధాన్యత కల్పిస్తారు? అన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.

ఏది ఏమైనా.. అమాత్య పదవుల కోసం ఆశా వహులు ఆశల పల్లకిలో ఊరేగుతుంటే, ప్రస్తుత మంత్రుల్లో మాత్రం తమ పదవులు నిలుస్తాయా? ఊడతాయా? అన్న ఆందోళన మొదలైంది. అధిష్టానం తీసుకోబోయే ఒక్క నిర్ణయం కొందరి రాజకీయ భవి ష్యత్తును ఉన్నత శిఖరాలకు చేర్చవచ్చు, మరికొందరిని నిరాశలో ముంచవచ్చు. అందుకే ఇప్పుడు అందరి చూపూ చంద్రబాబు నిర్ణయం వైపే!

అక్రమాలతో గెలిచారు

కూటమి నేతలపై రామ్‌కుమార్‌రెడ్డి ధ్వజం



విలేకరులతో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

ఇటీవల జరిగిన స్థానిక ఎన్నికల్లో అధికార తెలుగు దేశం పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడి, అక్రమాలు చేసి విజయం సాధించిందని వైసీపీ నేత, వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఇటీవల ఆయన వెంకటగిరిలోని తన నివాసంలో మాట్లా డుతూ, ఎన్నికల సందర్భంలో వెంకటగిరి నియోజక వర్గంలో టీడీపీ వారు అరాచకాలు సృష్టించారని, రాష్ట్రం మొత్తం అదే పంథాలో అక్రమాలకు పాల్పడ్డా రని విమర్శించారు. దౌర్జన్యాలు చేసి, ప్రజల మద్దతు తమ వైపు ఉందని వారు ప్రకటించుకోవడం హాస్యా స్పదమన్నారు. అంతటి అరాచకాల్లోనూ వైసీపీకి 35 శాతం ఓట్లు వచ్చాయని, నిజానికి 50 శాతం వరకు ఓట్లు వచ్చిన ప్రాంతాలు కూడా ఉన్నాయని తెలిపారు. టీడీపీ వారు ప్రజల్లో విశ్వాసాన్ని కోల్పోయి, హింసా త్మక రాజకీయాలకు పాల్పడ్డారని ఆయన ఆరోపిం చారు. ప్రజలు వైసీపీ వైపే ఉన్నారని, సైదాపురం, వెంకటగిరి రూరల్‌లో పరిషత్ ఎన్నికలలో 50శాతం ఓట్లు వచ్చాయన్నారు. ఇప్పటికే గెలుపొందిన మా పార్టీ ఎంపిటీసీలను బెదిరింపులు, దౌర్జన్యాలతో భయపెడుతున్నారని, ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా రానున్న ఎన్నికల్లో విజయం తమ పార్టీదేనన్నారు.

ఇందిరాగాంధీ జయంతి వేడుకలు



ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

భారత మాజీ ప్రధానమంత్రి, ఉక్కు మహిళ, భారతరత్న ఇందిరాగాంధీ జయంతి వేడుకలు ఈనెల 19న నెల్లూరులోని ఇందిరాభవన్‌లో జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ సమగ్రత, సమైక్యత, సార్వభౌమత్వం కోసం ఇందిరాగాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని నాయకులు కొనియాడారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ యశోధర మాట్లాడుతూ, ఇందిరాగాంధీ దేశం కోసం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారన్నారు. గరీబీ హటావో నినాదంతో పేదరిక నిర్మూలనకు కృషి చేశారని, హరిత విప్లవాన్ని ప్రోత్స హించి దేశాన్ని ఆహార ధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి దిశగా నడిపించారన్నారు. మహిళా సాధి కారతకు, పేదలు మరియు బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేశారని గుర్తుచేశారు. ఆమె ఆశయాలు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, జిల్లా కాంగ్రెస్ ఉపా ధ్యక్షులు తలారి బాలసుధాకర్, బుచ్చి కిషోర్, మల్లి కిషోర్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, ధనుంజయ, పవన్, అలీమా, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కృషి, త్యాగాలే.. విజయానికి పునాది

• మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ప్రజల ఆశీస్సులు, పార్టీ కార్యకర్తల కృషి, త్యాగాలు, నాయకుల సమిష్టి ప్రయత్నాల వల్లే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో అద్భుత విజయం సాధ్యమైందని రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరులోని తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో, నూతనంగా ఎన్నికైన ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ విజయం కేవలం పదవులు సాధించడానికే పరిమితం కాకుండా, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడానికి లభించిన గొప్ప అవకాశంగా, బాధ్యతగా భావించాలని సూచించారు. ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధిని మరింత వేగవంతం చేయడంతో పాటు పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికలకు సమాయత్తం కావడమే లక్ష్యంగా అందరూ కృషి చేయాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. ఎక్కడా వ్యక్తిగత బేధాభిప్రాయాలకు, చిన్నచిన్న విభేదాలకు తావివ్వకుండా కూటమి ఐక్యతను కాపాడుకోవాలని స్పష్టం చేశారు. గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు పరస్పర అవగాహనతో ముందుకు సాగుతూ, సాధ్యమైనచోట పంచాయతీలను ఏకగ్రీవం చేసుకునే దిశగా కృషి చేయాలని సూచించారు. పంచాయతీ ఎన్నికలు కేవలం రాజకీయ పోటీగా కాకుండా గ్రామాల అభివృద్ధికి ప్రజల మద్దతును మరింత బలోపేతం చేసుకునే అవకాశంగా భావించాలని అన్నారు. పార్టీ బలాబలాలను అంచనా వేసుకుంటూ, గ్రామ స్థాయిలో ప్రజల మద్దతును కూడగట్టుకుని కూటమి బలపరిచిన అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. పార్టీ గెలుపు కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని, ప్రజలు మనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా కూటమి ప్రభుత్వంపై మరింత విశ్వాసం పెంపొందించాలని మంత్రి ఆకాంక్షించారు. అనంతసాగరం, మర్రిపాడు, ఆత్మకూరు రూరల్ మండలాలకు చెందిన నూతనంగా ఎన్నికైన ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, మండల స్థాయి పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ అభ్యర్థుల.. తొలి జాబితా 21న

జిల్లాలో పంచాయతీ ఎన్నికల ప్రక్రియ పటిష్టంగా సాగుతోంది. జిల్లాలోని 35 మండలాల పరిధిలో ఉన్న 700 పంచాయతీలకి, 6668 వార్డులకు మూడు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. తొలి విడతలో 134, రెండో విడతలో 297, మూడో విడతలో 269 పంచాయతీలకు ఈనెల 26న ఎన్నికలు నిర్వహించనున్నారు. దీంతో గ్రామాల్లో రాజకీయాలు రసకందాయంలో పడ్డాయి.

ఈనెల 21న పంచాయతీ అభ్యర్థుల తొలి జాబితా విడుదల చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. తొలివిడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల పరిశీలన ఈనెల 18న పూర్తయింది. నామినేషన్లు అన్నీ వచ్చాక ఆయా క్లస్టర్ కేంద్రాల్లో నామినేషన్ల పత్రాలను ఆర్ఓ అధికారుల సమక్షంలో పరిశీలించారు. అల్లూరు, బోగోలు, దగదర్తి, జలదంకి, కలిగిరి, కావలి, కొండాపురం, వింజమూరు మండలాలోని 134 సర్పంచ్ స్థానాలు, 1332 వార్డు స్థానాలకి మొత్తంగా 4378 నామినేషన్లు వచ్చాయి. అందులో 231 నామినేషన్లు తిరస్కరణకి గురయ్యాయి. 147 నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు అధికారులు తేల్చారు. శుక్ర, శనివారాల్లో నామినేషన్లు ఉపసంహరణకు గడువుంది. ఈలోగా ఏకగ్రీవాలు చేసుకునేందుకు కూడా కొన్ని గ్రామాల్లో ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయి. అదేవిధంగా, రెండో విడతలో జిల్లాలో జరిగే పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియకు తొలిరోజైన బుధవారం నాడు 210 నామినేషన్లు వచ్చాయి. అనంతసాగరం, ఏఎస్‌పేట, ఆత్మకూరు, చేజర్ల, కలువాయి, మర్రిపాడు, సంగం, సీతారామపురం, ఉదయగిరి, చిల్లకూరు, గూడూరు, కోట, దుత్తలూరు, వరికుంటపాడు మండలాల్లో జరిగే ఈ ఎన్నికలకు మొదటిరోజున సర్పంచ్‌ల స్థానాలకి 89, వార్డులకి 210 నామినేషన్లు వచ్చాయి.

వరి వద్దు.. ఇతర పంటలు సాగుచేయండి

ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో వరికి బదులుగా ఉద్యాన పంటలు, చిరుధాన్యాల పంటలు సాగు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల రైతులకు సూచించారు. ఆమేరకు అధికారులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈనెల 18న నెల్లూరు కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో వివిధ శాఖల అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులతో సోమశిల, కండలేరు జలాశయాల్లో ప్రస్తుత నీటి నిల్వలు, నీటి లభ్యత, తాగునీటి అవసరాలపై కలెక్టర్ ఐఏబి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులందరూ పరిస్థితులను అర్థం చేసుకుని వరికి ప్రత్యామ్నాయంగా రాగులు, మొక్కజొన్న, పత్తి, మినుము, నువ్వులు, వేరుశనగ వంటి పంటల సాగు వైపు మొగ్గు చూపాలన్నారు. ఎల్‌నినో పరిస్థితుల ప్రభావం వలన తాగునీటికి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ప్రస్తుతం మన జలాశయాల్లో ఉన్న నీటిని అత్యంత జాగ్రత్తగా వాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

'పురమిత్ర' యాప్ మీకోసమే!

'పురమిత్ర' యాప్ మీకోసమేనని, నెల్లూరు నగర పౌరులు తమ ప్రాంతాల్లో ఏమైనా సమస్యలుంటే వాటిని నేరుగా అధికారుల దృష్టికి తీసుకువెళ్లేందుకు ఈ యాప్ ఎంతో ఉపయోగపడుతుందని నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ ఒక ప్రకటనలో తెలిపారు. పారిశుద్ధ్యం, చెత్త సేకరణ, మంచినీటి సరఫరా, వీధి దీపాలు, రోడ్లు, గుంతలు, మురుగునీటి కాలువలు, భూగర్భడ్రైనేజీ సమస్యలు, పార్కుల నిర్వహణ, అక్రమ నిర్మాణాలు, ప్రభుత్వస్థలాల ఆక్రమణలు వంటి విషయాలపై ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని, ఏ సమస్యలున్నా ప్రజలు వాటి వివరాలను, ఫోటోలతో పాటు యాప్‌లో తెలియజేయవచ్చన్నారు. మునిసిపల్ పన్నులు చెల్లించేందుకు కూడా 'పురమిత్ర' యాప్ ఉపకరిస్తుందని, నగర పౌరులు దానిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైల్వే సమస్యల పరిష్కారానికి..

ఎంపీ వేమిరెడ్డి కృషి!

• సౌత్ కోస్ట్ రైల్వే జోన్ జీఎంకు లేఖ



రైల్వే జీఎంకి లేఖను అందజేస్తున్న విపిఆర్ కార్యాలయ ప్రతినిధి పెంచలరెడ్డి

సౌత్ కోస్ట్ రైల్వే జోన్ జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్ ఈనెల 18న నెల్లూరు రైల్వేస్టేషన్ తనిఖీకి వచ్చిన సందర్భంగా నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆయన కార్యాలయ ప్రతినిధి పెంచల రెడ్డి జీఎంను కలిసి ఎంపీ రాసిన లేఖను అందజేశారు. నెల్లూరు పార్లమెంట్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కీలక రైల్వే సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోరారు. అమృత్ పథకం కింద నిధులు మంజూరైనా, నెల్లూరు రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు ఇంకా పూర్తికాక ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, ఆ పనులు వేగంగా పూర్తయ్యేలా గడువు నిర్ణయించి, సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. నెల్లూరులోని వెంకటేశ్వరపురం సమీపంలో గాంధీ గిరిజనకాలనీ వద్ద రైల్వే అండర్‌బ్రిడ్జి నిర్మించాలని కోరారు. ఆత్మకూరు బస్టాండ్ నుంచి పెన్నానది వరకు మినీబైపాస్ రోడ్డు వెంట ఉన్న రైల్వే భూముల్లో భూమి సుందరంగా తీర్చిదిద్దడం, మొక్కల పెంపకం, కాంపౌండ్ ఫెన్సింగ్ వంటి పనులు చేపట్టాలని కోరారు. నెల్లూరు రైల్వేస్టేషన్ వద్ద ఆటో డ్రైవర్లకు ప్రత్యేక పార్కింగ్ లేక ఇబ్బంది పడుతున్నారని, పార్కింగ్ సౌకర్యం కల్పిస్తే స్టేషన్ ప్రవేశద్వారం వద్ద ట్రాఫిక్ రద్దీ తగ్గుతుందని తెలిపారు. అదేవిధంగా, కొడవలూరు మండలం నార్త్ రాజుపాళెం సమీపంలోని టపాతోపు లెవల్ క్రాసింగ్ నంబరు 127 అండర్‌పాస్‌ను పూర్తిస్థాయి డబుల్‌లేన్‌గా విస్తరించాలని కోరారు. ఈ అండర్‌పాస్‌కు పడమర వైపు రెండు వరుసలు, తూర్పువైపు ఒక్క వరుసే ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, వాహనాల రాకపోకలు సురక్షితంగా సాగాలంటే విస్తరణ అవసరమని తెలిపారు. వెనుకబడిన, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి నడికుడి-శ్రీకాళహస్తి కొత్త రైల్వే లైన్ ఎంతో కీలకమని, దీనిపై కేంద్ర రైల్వేశాఖ మంత్రికి కూడా లేఖ రాసినట్లు గుర్తుచేశారు. ఈ అంశాలకు ప్రాధాన్యత ఇచ్చి, సమస్యలు పరిష్కరించాలని ఆయన ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు.



4వ వర్ధంతి

అమ్మా...
నిష్కల్మషమైన ప్రేమను పంచిన
స్వచ్ఛమైన మనసు మీది..
అడిగినవారికి లేదనకుండా
సాయంచేసిన సహృదయం మీది.
మా జీవితాలలో వెలుగులు నింపిన
అనురాగమూర్తి మీరు..
మాలో సేవాస్ఫూర్తిని వెలిగించిన
ఆత్మీయదీప్తి మీరు.

జననం : 1924 నిర్యాణం : 2022

శ్రీమతి బోగొల్లు పిచ్చమ్మ గారు

పరమపదించి తేది. 24.11.2026 నాటికి నాలుగేళ్ళు గడవనున్న సందర్భంగా
ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ... వారి పవిత్ర ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...

కుమారులు - కోడళ్ళు
బోగొల్లు మోహన్‌రెడ్డి - నిర్మలమోహన్
MOHAN ARCHITECTS Pvt. Ltd., MOHAN ASSOCIATES BUILDERS, Hyderabad.
డాక్టర్ బోగొల్లు ప్రభాకర్‌రెడ్డి - డాక్టర్ సరోజిని
నెల్లూరు
మరియు కుటుంబసభ్యులు

లాయర్
నవంబర్ 20, 2026

ప్రశ్నార్థకంగా మారుతున్న.. బాలల భవిత!

మనదేశంలో బాలల సంక్షేమం కోసం ఎన్నో పథకాలున్నా. అవి అట్టడుగున ఉన్న అసలైన లబ్దిదారులకు చేరడమే లేదు. నేటికీ కోట్లాదిమంది బాలలు సంక్షోభంలోనే ఉన్నారంటే అందుకు ప్రధాన కారణం అదే. పథకాల అమలుకు సరైన పర్యవేక్షణ, జవాబుదారీతనం లేకపోవడం ఒక పెద్ద లోపం. ఆర్థిక, కుటుంబ సమస్యలు వారిని పట్టి పీడిస్తూనే ఉన్నాయి. బాలల సంక్షేమానికి ముఖ్యంగా పేదరికం ప్రతి బంధకంగా ఉంటోంది. నిరుపేద కుటుంబాల్లో పుట్టిన పిల్లలు అనేకమంది తినడానికి సరైన తిండిలేక బక్కచిక్కిపోతుండడం అందరికీ తెలిసిందే. ఇక వారికి విద్యా వైద్యం వంటివి కూడా అంతంత మాత్రమే. పౌష్టికాహార లోపం వల్ల బాలలు బరువు తగ్గడం, సరిగా ఎదగకపోవడం, శారీరక-మానసిక వ్యాధులతో సతమతం కావడం వంటి దురదృష్టకర పరిణామాలు వారి జీవితాలను క్రమేణా అంధకారంలోకి నెట్టేస్తున్నాయి. రెక్కాడితే కానీ డొక్కాడని నిరుపేదలు, ఆరుగాలం కష్టపడి పనిచేసే వ్యవసాయ కూలీలు, కష్టజీవులు, శ్రామికుల పిల్లలు, బడుగు బలహీనవర్గాల వారు, అడవులు-కొండ ప్రాంతాల్లో నివసించే గిరిజనుల పిల్లలు నేటికీ సరైన పోషణ, విద్యా వసతులు లేక నిరంతరం బాధలు పడుతూనే ఉన్నారు. అంతేకాదు, పాతకాలపు నాటి బాల్యవివాహాలు, దురాచారాల వంటి సామాజిక రుగ్మతలతో ఇంకా అనేకమంది నిరుపేద బాలల జీవితాలు అంధకార బంధురంగానే ఉంటున్నాయి. బాలల విద్యకు ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వాలు పాఠశాలలను, హాస్టళ్ళను పెద్దసంఖ్యలోనే ఏర్పాటుచేస్తున్నా, మధ్యాహ్నభోజన పథకాలవంటి వాటిని అమలులోకి తెచ్చినా, బడుల్లోనూ బాలలకు నాణ్యమైన విద్య అందడం లేదు. ఉపాధ్యాయుల కొరత, సరైన సౌకర్యాలు లేకపోవడం, నేటి డిజిటల్ విద్యకు అవసరమైన సాంకేతిక వనరులు అందరికీ అందుబాటులోకి రాకపోవడం వంటి అసౌకర్యాలతో ఆధునిక విద్య కూడా నత్త నడక నడుస్తూనే ఉంది. మధ్యతరగతి, లేదా ధనిక కుటుంబాల్లో పిల్లలు పాఠశాలలకు వెళ్తున్నా, అక్కడ కూడా వారికి తిప్పలు తప్పడం లేదు. లైంగిక వేధింపులు, సెల్‌ఫోన్ గేమింగ్‌లు, అశ్లీల కంటెంట్‌లు, ఆన్‌లైన్ ప్రమాదాలు, మాదక ద్రవ్యాల ప్రభావాలు, దురలవాట్లకు దారితీసే చెడుస్నేహాల వంటివి చిన్నవయసులోనే చుట్టుముడుతున్నాయి. తల్లి తండ్రులు, గురువుల పర్యవేక్షణ నామమాత్రంగానే ఉంటుండడంతో బాలలకి ఇవన్నీ వ్యసనాలుగా మారుతున్నాయి. స్మార్ట్‌ఫోన్‌ల మాయాజాలంలో పడి మానసిక వత్తిడితో, న్యూనతాభావంతో, ఒంటరితనం, కుంగుబాటు తదితర బలహీనతలతో అల్లాడిపోతున్న బాలలెందరో ఉన్నారు. పెద్దల మాటలు వినకపోవడం, గురువులను లెక్కచేయకపోవడం, మూర్ఖంగా ప్రవర్తించడం వంటివి అనేక కుటుంబాల్లో పిల్లలకు సర్వసాధారణమై పోతున్నాయి. గొప్పగా చెప్పుకునేందుకు బాలలకు అనేకరకాల హక్కులు ఉన్నా, అవన్నీ కాగితాల మీదనే తప్ప వాస్తవానికి క్షేత్రస్థాయిలో ఆశించిన స్థాయిలో ఆచరణలోకి రావడం లేదు. దేశంలోని అనేక ప్రాంతాల్లో బాలల చదువులు అస్తుబిస్తుగానే ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో, బడుల్లో సరైన భద్రత లేకపోవడం, కుటుంబాల్లో రకరకాల సమస్యలు, తల్లితండ్రులు నిరుపేదలు కావడం వంటి కారణాలతో అనేక మంది బాలలు, ముఖ్యంగా బాలికలు చదువుకు దూరమవుతూనే ఉన్నారు. చదువుకోవాలనే కోరిక వారిలో ఉన్నా, చదువుకునే పరిస్థితులు లేకపోవడంతో వారు బాల్యం నుంచి కష్టాలతోనే సహవాసం చేస్తున్నారు. చెప్పుకోలేనన్ని సమస్యలతో వారు మానసికంగా నలిగిపోతున్నారు. ఇకనైనా ప్రభుత్వాలు, పాలకులు వారికి అండగా నిలిచి బాలల సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సి ఉంది. ఇంటా-బయటా పడుతున్న సమస్యల నుంచి, వేదనా రోదనల నుంచి వారిని కాపాడేందుకు సమగ్రమైన ప్రణాళికలు రూపొందించి, చిత్తశుద్ధితో అమలుచేయాల్సి ఉంది. దేశంలోని కోట్లాదిమంది బాలల బాధలకు శాశ్వత ప్రాతిపదికన పరిష్కారాలు చూపాల్సి ఉంది. అందులోనూ నిరుపేదలు, అనాథలు, దివ్యాంగులు, వీధిబాలలు, వలస కార్మికుల పిల్లలు, కొండకోనల్లోని గిరిజనుల బిడ్డలు వంటి అట్టడుగు బాలల సంక్షేమానికి నడుం బిగించాల్సి ఉంది. కేవలం ప్రభుత్వాలే కాక, సమాజంలోని ప్రతిఒక్కరూ మానవతా హృదయంతో బాలలకు చేయందించాల్సి ఉంది. బాలల రక్షణ, వారి హక్కుల సంరక్షణ అనేవి కేవలం బాధ్యత మాత్రమే కాదు..అది మనందరి కర్తవ్యం కూడా. ఇప్పుడు పెద్దలైన వారంతా ఒకప్పటి బాలలే అన్నది కూడా గుర్తుంచుకుని..సత్వరమే బాలల జీవితాలకి భద్రతను, వారి భవితకి భరోసాను కల్పించడం ఎంతైనా అవసరం!..

సాక్షి పత్రికపై కూడా జగన్ పట్టు కోల్పోయాడా?

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహనరెడ్డికి చెందిన సాక్షి దినపత్రికలో ఇటీవల వస్తున్న కొన్ని వార్తలు విస్మయం కలిగిస్తున్నాయి. సాక్షి పత్రికపై కూడా జగన్‌రెడ్డి పట్టు కోల్పోయాడా? అన్న అనుమానం కలుగుతోంది. ఉదాహరణకి.. తాజాగా షర్మిల విషయంలో సాక్షిలో వస్తున్న వార్తలు, వాటిపై వచ్చిన విమర్శలకి సదరు పత్రిక నిర్వాహకులు స్పందిస్తున్న తీరు హాస్యాస్పదంగా వుంది. షర్మిలమ్మ తమ కుమార్తె పెళ్ళికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని వ్యక్తిగతంగా ఆహ్వానించింది. ఎక్కడైనా, ఎప్పుడైనా అధికార ప్రతిపక్ష పార్టీల నేతలు తమ ఇళ్లల్లో జరిగే శుభ



కార్యక్రమాల సందర్భంగా రాజకీయాలని పక్కనపెట్టి ఒకరినొకరు ఆహ్వానించుకోవడం ఆనవాయితీ. ఇది మంచి సంప్రదాయం కూడా. అదే క్రమంలో షర్మిల బాబుని ఆహ్వానించింది. ఆ విషయాన్ని కూడా తమ రాజకీయ ప్రయోజనాలకు వాడుకుని 'బాబుతో చెట్టపట్టాల్', సీఎంతో షర్మిల ఆత్మీయ సంబంధాలు' అంటూ తమ సాక్షి పత్రికలో వార్త ప్రచురించడం సిగ్గుచేటైన విషయం. పైగా "చెట్ట పట్టాల్ అంటే తప్పేమిటి" అంటూ పక్కరోజు తమ వార్తని సమర్థించుకోవడం ఇంకా నీచం. కనీసం సాక్షి పత్రికనైనా జగన్‌రెడ్డి పట్టించుకుంటున్నాడా? లేక పార్టీలాగా పత్రిక పెత్తనం కూడా సజ్జలకే అప్పజెప్పాడా? అన్న అనుమానం కలుగుతోంది. ఇలాంటి హేయమైన చర్యలతో, అర్థరహిత చేష్టలతో ప్రజలలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్ట అంతకంతకీ దిగజారిపోతోంది. ఇప్పటికైనా ఆయన కళ్ళు తెరవకపోతే ఈసారి 11 కూడా అనుమానమే!

డి.హరిత, గూడూరు.

సూళ్లూరుపేట కాళంగిపై కొత్త బ్రిడ్జి కావాలి!

సూళ్లూరుపేట పట్టణంలో శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయం వద్ద ఉండే కాళంగి బ్రిడ్జి మీద నవంబర్ 12వ తేదీ నుంచి భారీ వాహనములు నిషేధించారు. ఇటు నెల్లూరు వైపు నుండి అటు చెన్నై వైపు నుండి పట్టణంలోకి వచ్చే వాహనములు హోళీ క్రాస్ జంక్షన్ వైపుగా వెళ్ళాలి. ఎన్నో ఏళ్ళుగా ఈ బ్రిడ్జి శిథిలావస్థలో ఉంది. ఇటు ప్రభుత్వము గాని అటు నాయకులుగాని పట్టించుకొన్న పాపాన పోలేదు. ఈ కూటమి ప్రభుత్వములో అయినా నాయకులు స్పందించి త్వరితగతిన పాత బ్రిడ్జి స్థానములో కొత్త బ్రిడ్జి నిర్మాణానికి పూనుకోవాలి. యుద్ధప్రాతిపదికన దానిని పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుచున్నాను.

– కే.సుబ్రహ్మణ్యం, నెల్లూరు.

పురపాలనలో మహిళల ప్రాధాన్యత శుభ సూచకం!

నెల్లూరు పురపాలనలో 50శాతానికి పైగా మహిళలకి ప్రాధాన్యత కల్పించడం శుభ సూచకం. ఈ పరిణామం ద్వారా సేవాదృక్పథంలో మార్పు రావాలి. అభివృద్ధి దిశగా మునిసిపాలిటీలు పరుగుతీయాలి. స్వతహాగా మహిళలు కార్య సాధకులు, అంతే కాదు మేధో సంపన్నులు కూడా. వారికి పాలనా పగ్గాలు అప్పగించి స్వతంత్ర నిర్ణయాలు తీసుకునే అవకాశం కల్పిస్తే ప్రజా సేవలో దూసుకుపోతారనడంలో సందేహం అవసరం లేదు.

సీ.ఆర్. విశ్వేశ్వరరావు
మాజీ ఉపకులపతి, హైదరాబాదు.

'క్లౌడ్' కుప్పకూలితే కీలక రంగాల గతేమిటి?



నవంబర్ 12-14 మధ్య 74 దేశాల్లో మైక్రోసాఫ్ట్ 365 సేవలు ఒక్కసారిగా నిలిచిపోవడం ప్రపంచ డిజిటల్ వ్యవస్థల దుర్బలత్వాన్ని మరోసారి బయటపెట్టింది. ఈ అంతరాయం వల్ల విమానయాన సంస్థలు, బ్యాంకులు, న్యాయస్థానాలు, ప్రభుత్వ కార్యాలయాల కార్యకలాపాలు గంటల తరబడి స్తంభించిపోయాయి. భారత కేంద్ర ప్రభుత్వ ఈ-మెయిల్ వ్యవస్థ ఎన్ఐసీ పరిధిలో స్వతంత్రంగా ఉండటం వల్ల మన ప్రభుత్వ కార్యకలాపాలకు పెద్దగా అవాంతరాలు కలగనప్పటికీ, దేశీయ విమానయాన సంస్థలు, ప్రైవేట్ రంగాలు మాత్రం ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. ఇది కేవలం ఒక సాంకేతిక లోపం మాత్రమే కాదు; దేశ డిజిటల్ భద్రతకు ఒక హెచ్చరిక.

ప్రస్తుతం భారత సైబర్ భద్రతా నిబంధనలు ప్రధానంగా ఉద్దేశపూర్వక సైబర్ దాడుల చుట్టూనే తిరుగుతున్నాయి. ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ 2022 మార్గదర్శకాల ప్రకారం, రాన్సమ్‌వేర్ లేదా డేటా చౌర్యం వంటి సైబర్ దాడులు జరిగితే సంబంధిత సంస్థలు ఆరు గంటల్లోగా నివేదించాలి. కానీ, క్లౌడ్ సర్వీస్ ప్రొవైడర్ల సర్వర్లలో సాంకేతిక లోపాలు, సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ వైఫల్యాల వల్ల కలిగే అంతరాయాలపై స్పష్టమైన నియంత్రణ లేదు. ప్రమాదవశాత్తూ జరిగే ఈ సేవల నిలిపివేత నిబంధనల పరిధిలో ఒక అంతరంగా మిగిలిపోయింది. అయితే, వినియోగదారుడి దృష్టిలో సైబర్ దాడి వల్ల సేవలు ఆగినా, సర్వర్ లోపం వల్ల ఆగినా జరిగే నష్టం ఒక్కటే. క్లౌడ్ టెక్నాలజీ సమాచార రంగంలో ఒక నిశ్శబ్ద విప్లవం. ఈ టెక్నాలజీ డేటా నిల్వ, నిర్వహణ తీరును పూర్తిగా మార్చేసింది. ఒకప్పుడు సమాచారం దాచుకోవడానికి పెద్ద హార్డ్ డిస్క్‌లు, సర్వర్ రూమ్‌లు అవసరమై భారీగా హార్డ్‌వేర్ ఖర్చులు భరించాల్సి వచ్చేది; క్లౌడ్ టెక్నాలజీతో నేడు అవసరమైన మేరకు మాత్రమే చెల్లించే విధానంతో ఎక్కడి నుంచైనా డేటాను యాక్సెస్ చేసే వెసులుబాటు వచ్చింది. గతంలో హార్డ్‌వేర్ పాడైతే సమాచారం పూర్తిగా కోల్పోయే ప్రమాదం ఉండేది, కానీ ఇప్పుడు క్లౌడ్ ఆటోమేటిక్ బ్యాకప్ వల్ల డేటా సురక్షితంగా ఉంటోంది. అలాగే, కార్యాలయాలకే పరిమితమైన పనితీరును రిమోట్ వర్కింగ్‌గా మార్చి, ప్రపంచంలో ఎక్కడి నుంచైనా ఒకే ప్రాజెక్టుపై కలిసి పనిచేసే అవకాశం కల్పించింది. వ్యాపారం పెరిగినప్పుడు సర్వర్ల కోసం వారాలు వేచి చూసే ఇబ్బంది పోయి, ఒకే క్లిక్‌తో స్టోరేజ్ పెంచుకునే సౌలభ్యం, సాఫ్ట్‌వేర్ల ఆటోమేటిక్ అప్‌డేట్స్ వచ్చాయి. ఈ టెక్నాలజీ పుణ్యమా అని ఖరీదైన ఏఐ టూల్స్ ఇప్పుడు చిన్న స్టార్టప్‌లకు కూడా అందుబాటులోకి వచ్చాయి.

ప్రస్తుతం ప్రభుత్వాలు, బ్యాంకులు, ఆసుపత్రులు, విమానాశ్రయాలు, వ్యాపార సంస్థలు తమ కార్యకలాపాల్లో క్లౌడ్ సేవలను విస్తృతంగా ఉపయోగిస్తున్నాయి. సమాచార నిల్వ, ఉద్యోగుల మధ్య సమాచార మార్పిడి, చెల్లింపులు, కస్టమర్ సేవలు, రికార్డుల నిర్వహణ వంటి పనులు డిజిటల్ వేదికల ద్వారా సాగుతున్నాయి. ఇది నిర్వహణ వ్యయాన్ని తగ్గించడంతోపాటు వేగం, సౌలభ్యాన్ని అందిస్తోంది. డిజిటల్ ఇండియా వేగంగా విస్తరిస్తున్న తరుణంలో, బ్యాంకింగ్, విమానయానం, ఆరోగ్యం, విద్యుత్, టెలికాం వంటి కీలక మౌలిక సదుపాయాల రంగాలు ఒకే క్లౌడ్ వేదికపై ఆధారపడటం అత్యంత ప్రమాదకరం. ఆర్థిక లావాదేవీలు, విమానాల రాకపోకలు, ఆసుపత్రి సేవలు నిలిచిపోతే అది దేశ భద్రతకు, ప్రజా జీవనానికి తీవ్ర విఘాతం కలిగిస్తుంది. అందువల్ల, కీలక రంగాలకు 'మల్టీ-క్లౌడ్ బ్యాకప్' , 'ఆఫ్‌లైన్ ఫెయిల్-సేఫ్' తప్పనిసరి చేయాలి.

దీనిపై భిన్నాభిప్రాయాలు కూడా ఉన్నాయి. మల్టీ-క్లౌడ్ వ్యవస్థలను నిర్వహించడం వల్ల సంస్థలపై ఆర్థిక భారం పెరుగుతుందని, సాంకేతిక సంక్లిష్టత ఎక్కువవుతుందని పరిశ్రమ వర్గాలు వాదిస్తాయి. చిన్న, మధ్యతరహా సంస్థలకు ఇది కష్టసాధ్యం కావచ్చు. కానీ, జాతీయ భద్రత, ప్రజా ప్రయోజనాలతో ముడిపడి ఉన్న కీలకరంగాల విషయంలో ఖర్చుకంటే డిజిటల్ భద్రతే ముఖ్యం. యూరోపియన్ యూనియన్ తెచ్చిన 'డిజిటల్ ఆపరేషనల్ రెసిలియెన్స్ యాక్ట్', 'NIS2' తరహాలో, భారత్ కూడా క్లౌడ్ వైఫల్యాలను తప్పనిసరిగా నివేదించేలా, కీలక రంగాలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకునేలా చట్టపరమైన నిబంధనలు రూపొందించాల్సిన అవసరం ఉందని ఈ ఉదంతం చెబుతోంది. సాంకేతికత ఎంత ఆధునికమైనా, వైఫల్యాలు సహజం. కానీ, ఆ వైఫల్యం దేశాన్ని స్తంభింపజేయకుండా చూసుకోవడమే అసలైన విధాన దక్షత. రేపటి డిజిటల్ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి భారత్ ఇప్పటి నుంచే సన్నద్ధత మొదలు పెట్టాలి. ఇంటర్నెట్ అందుబాటులో లేకున్నా అత్యవసర కార్యకలాపాలు కొనసాగించేలా స్థానిక వ్యవస్థలు పనిచేయాలి. బ్యాకప్ తీసుకోవడం మాత్రమే సరిపోదు. ఆ బ్యాకప్ నుంచి ఎంత సమయంలో సేవలను పునరుద్ధరించగలమో ముందుగానే పరీక్షించాలి. డేటా మరోచోట ఉన్నప్పటికీ, దాన్ని ఉపయోగించే వ్యవస్థే పనిచేయకపోతే ప్రయోజనం ఉండదు. విమానాశ్రయంలో ప్రయాణికుల జాబితాలు, ఆసుపత్రిలో అత్యవసర రోగుల సమాచారం, బ్యాంకులో కనీస లావాదేవీల నిర్వహణ వంటి సేవలకు పరిమితమైన ప్రత్యామ్నాయ విధానం ఉండాలి. ప్రతి సంస్థకు రెండు లేదా మూడు క్లౌడ్ సేవలను నిర్వహించడం ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. చిన్న సంస్థలకు ఇది ఆర్థిక భారంగా మారవచ్చు. అందుకే అన్ని సంస్థలకు ఒకే ప్రమాణాన్ని విధించడం కాకుండా, ప్రజల జీవితాలు, ఆర్థిక వ్యవస్థ, జాతీయ భద్రతపై ప్రభావం చూపే సంస్థలను గుర్తించి వాటికి ప్రత్యేక నిబంధనలు రూపొందించాలి. సేవల పునరుద్ధరణకు గరిష్ఠ సమయం, డేటా నష్టం పరిమితి, ప్రత్యామ్నాయ కార్యకలాపాల నిర్వహణ, వైఫల్యం సమయంలో ప్రజలకు సమాచారాన్ని అందించే విధానం వంటి అంశాలను నియంత్రణ సంస్థలు నిర్దేశించాలి.



డిజిటల్ పరివర్తన అంటే పాత వ్యవస్థలను పూర్తిగా తొలగించి కొత్త సాంకేతికతపై ఆధారపడటం కాదు. కొత్త సాంకేతికత ప్రయోజనాలను పొందుతూనే, దాని వైఫల్యాలను తట్టుకునే ఏర్పాట్లు చేసుకోవడం. ఒక సాంకేతిక వ్యవస్థ ఎంత వేగంగా పనిచేస్తుందన్నదే కాదు, అది పనిచేయనప్పుడు కూడా సమాజాన్ని ఎంత సమర్థంగా ముందుకు నడిపించగలదన్నదే డిజిటల్ భద్రతకు అసలు ప్రమాణం.

- తుమ్మల బాల గంగాధర్ తిలక్

పౌరుషాలు కాదు..

పరితోషికాలు సాధించండి



సోమిరెడ్డి

పంచాయతీ ఎన్నికలంటేనే..పౌరుషానికి పోయి విచ్చలవిడిగా ఖర్చుపెట్టడం, అప్పులు పాలుకావడం, లేనిపోని బేషజాలతో గొడవలకు దిగడం...ఇలాంటి ఎన్నో పరిణామాలను చూస్తుంటాం...ఇలాంటి వాటికి అవకాశం లేకుండా గ్రామాల భవిష్యత్తు గురించి ఆలోచించాలని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో, గ్రామాల్లో ఏకగ్రీవాలు జరిగితే అది గ్రామాల అభివృద్ధికి బాటలు వేస్తుందని, ప్రజలు ఈ విషయం గమనించాలని ఆయన సూచించారు. పల్లెల పాలనలో కీలకమైన పంచాయతీ పాలకవర్గాల ఏకగ్రీవాలను ప్రోత్సహిస్తూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కీలకనిర్ణయం తీసుకుందన్నారు. 5వేలు లోపు జనాభా ఉన్న పంచాయతీకి రూ. 15లక్షలు, రూ. 10వేలు లోపు జనాభా ఉన్న పంచాయతీకి రూ. 25లక్షలు, ఆపైన జనాభా ఉన్న పంచాయతీకి రూ. 50లక్షలు చొప్పున ప్రోత్సాహకాలను ప్రభుత్వం ప్రకటించడం శుభపరిణామమని చెప్పారు. గ్రామాల అభివృద్ధికి ఉపయోగపడే ఈ ప్రోత్సాహకాల విషయంలో ప్రతిఒక్కరూ ఆలోచించాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఏకగ్రీవ పంచాయతీలకు రూ. 5 లక్షల చొప్పున ప్రోత్సాహకాలు ప్రకటించినా ఒక్క రూపాయి విడుదల చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏకగ్రీవ పంచాయతీ లకు వచ్చే ప్రోత్సాహకాలను వెంటనే విడుదల చేసి గ్రామాలకు ఖర్చుపెట్టే బాధ్యత తమదన్నారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ కూటమి పార్టీలు అధికారంలో ఉన్నాయి కనుక, పంచాయతీల అభివృద్ధికి భారీగా నిధులు తెచ్చుకోవచ్చని, రాజకీయ భేషజాలకు పోయి జేబులు ఖాళీ చేసుకోకుండా ఏకగ్రీవాలకు సహకరించే విషయంలో అందరూ సానుకూలంగా వ్యవహరించాలని ఆయన కోరారు.

కావలి, గూడూరు, అల్లూరులలో

ఎన్నికల సందడి

26న పోలింగ్, 30న కౌంటింగ్

జిల్లాలోని కావలి, గూడూరు మునిసిపాలిటీలు, అల్లూరు నగర పంచాయతీలలో ఎన్నికల సందడి నెలకొంది. కావలిలో 44, గూడూరులో 48, అల్లూరులో 23 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయి. నవంబరు 26న పోలింగ్, 30న ఓట్ల లెక్కింపు ఉంటుంది. 26వ తేదీన ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. 30వతేదీ ఉదయం 8గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. సాయంత్రానికల్లా అభ్యర్థుల భవితవ్యం తేలిపోతుంది.

చిటికెనవేలికి 'సిరా' గుర్తు

ఇటీవల జరిగిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో ఎడమచేతి చూపుడు వేలికి వేసిన సిరా గుర్తులు ఇంకా తొలగిపోక పోవడంతో, గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఓటర్ల ఎడమ చేతి చిటికెన వేలికి సిరా గుర్తు వేయనున్నారు. ఆమేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఒక ప్రకటనలో తెలిపారు.

డిసెంబరు 12న..జాతీయ లోక్‌అదాలత్

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.నరసింహమూర్తి



జిల్లా వ్యాప్తంగా వచ్చే నెల 12 (డిసెంబరు 12-రెండవ శనివారం రోజు)న జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్మెన్.. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.నరసింహమూర్తి ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. జిల్లాలోని అన్ని న్యాయ స్థానాల్లో పెండింగ్‌లో ఉన్న, చట్టప్రకారం రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, వివాహ సంబంధిత కేసులు, మోటార్ వాహన ప్రమాద కేసులు, సివిల్ కేసులు, మరియు ఇతర లిటిగేషన్ (ముందస్తు వ్యాజ్యము) కేసుల పరిష్కారం కోసం ఈ కార్యక్రమం నిర్వహించ నున్నామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇటీవల కోర్టు ఆవరణలో జరిగిన సమావేశంలో తెలియజేశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ మరియు జిల్లాలోని అన్ని మండల న్యాయసేవాధికార సంస్థల (కోవూరు, సూళ్ళూరుపేట, నాయుడుపేట, గూడూరు, వెంకటగిరి, ఆత్మకూరు, కావలి, ఉదయగిరి, కోట) ఆధ్వర్యంలోని అన్ని న్యాయస్థానాల ప్రాంగణాల్లో జాతీయ లోక్ అదాలత్ జరుగుతుంది కనుక కక్షిదారులు, న్యాయవాదులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 'రాజీయే రాజమార్గమని', తమ కేసులను రాజీమార్గం ద్వారా సత్వరమే పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరులో మూడు స్టార్ హోటళ్ళు!



మొత్తం పెట్టుబడులు 400 కోట్లకి పైగానే

140 కోట్లతో డిఎస్ఆర్ హాస్పిటాలిటీ తొలి అడుగు



నెల్లూరులో ఒక మంచి స్టార్ హోటల్ కావాలన్న నెల్లూరీయుల చిరకాల కోరిక తీరబోతోంది. త్రిబుల్ ధమాకా అన్నట్లుగా ఒకేసారి రెండు 5స్టార్ హోటల్స్‌తో పాటు ఒక 4స్టార్ కలిపి మొత్తం మూడు స్టార్ హోటళ్ళు నెల్లూరులో ప్రారంభం కాబోతున్నాయి.

ఇందులో భాగంగా డిఎస్ఆర్ హాస్పిటాలిటీ సర్వీసెస్ 139.92 కోట్లతో 123 గదులతో తమ హోటల్ నిర్మాణాన్ని ప్రారంభించినట్లు అధికారికంగా ప్రకటించింది. నెల్లూరులోని చెన్నై-కోల్‌కత్తా జాతీయ రహదారి సమీపంలో డిఎస్ఆర్ నిర్మాణ సంస్థ జి+33 అంతస్తులతో నిర్మిస్తున్న "ది-1 బై డిఎస్ఆర్" అపార్ట్‌మెంట్‌కి అనుబంధంగా ఈ హోటల్ నిర్మిస్తున్నారు. "డిఎస్ఆర్ వెల్కమ్ హోటల్" బై ఐటీసీగా ఈ 5స్టార్ హోటల్ పేరు ఉండబోతున్నట్లు సమాచారం. తాజాగా నవంబర్ 12, 13తేదీలలో విశాఖపట్టణంలో జరిగిన సిఐఐ పార్టనర్‌షిప్ సదస్సులో డిఎస్ఆర్ సంస్థల ఛైర్మన్ దేవిరెడ్డి సుధాకరరెడ్డి తాము నెల్లూరులో స్టార్ హోటల్ నిర్మాణం ద్వారా పర్యాటక రంగంలో పెట్టబోతున్న 139.92 కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ఒప్పంద పత్రాలని రాష్ట్ర ఐటీ మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, పర్యాటక మంత్రి కందుల దుర్గేష్‌ల సమక్షంలో మార్చుకున్నారు. పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్ ఈ ఒప్పంద పత్రాలని అందుకున్నారు.

వీపీఆర్ హాస్పిటాలిటీ ఎల్ఎల్పి సంస్థ సారథ్యంలో మరో 5స్టార్ హోటల్!

నెల్లూరులోని అదే జాతీయ రహదారి సమీపంలో ఇప్పటికే వినియోగంలో ఉన్న "వీపీఆర్ శాంతినికేతన్" విల్లాలకి అనుబంధంగా సుమారు 145 కోట్లకి పైగా పెట్టుబడితో మరో 5స్టార్ హోటల్ నిర్మాణానికి నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి శ్రీకారం చుట్టారు. "వీపీఆర్ నోవాటెల్" పేరుతో రాబోతున్నట్లు తెలుస్తున్న ఈ 5నక్షత్రాల హోటల్‌లో ఆధునిక హంగులతో 140 రూములు, 12సూట్లు కలిపి మొత్తం 152 గదులు ఉండబోతున్నట్లు సమాచారం. "వీపీఆర్ హాస్పిటాలిటీ ఎల్ఎల్పి" సంస్థ నిర్మిస్తున్న ఈ నిర్మాణానికి కావలసిన అన్ని హంగులని పూర్తిచేసుకుని, ప్రభుత్వ అనుమతులు పొందే దశలో ఉన్నట్లు సమాచారం.



ఇటీవల విశాఖలో జరిగిన సిఐఐ పార్టనర్‌షిప్ సదస్సులో ఐటీ మంత్రి నారా లోకేష్ పర్యాటక మంత్రి కందుల దుర్గేష్‌ల సమక్షంలో ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న డిఎస్ఆర్ సంస్థల ఛైర్మన్ దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి. పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రావత్



యూనిక్ ప్రాజెక్ట్స్ వారి "ఫార్చ్యూన్ పార్క్" బై ఐటీసీ!

నెల్లూరు నగరం ముత్తుకూరురోడ్డులో అపోలో హాస్పిటల్స్ సమీపంలో నిర్మితమవుతున్న నెల్లూరులోని మొట్టమొదటి 23 అంతస్తుల అపార్ట్‌మెంట్ సముదాయం "యూనిక్ స్కైర్"కి అనుబంధంగా యూనిక్ ప్రాజెక్ట్స్ సారథ్యంలో మరో 4స్టార్ హోటల్ నిర్మాణం శరవేగంగా సాగుతోంది. "ఫార్చ్యూన్ పార్క్" బై ఐటీసీ అనే పేరుతో ప్రారంభం కానున్న ఈ హోటల్‌లో 103 రూములు రాబోతున్నాయి. సుమారు వందకోట్లకు పైగా నిర్మాణ వ్యయం అంచనాతో యూనిక్ ప్రాజెక్ట్స్ యాజమాన్యం ఈ హోటల్‌ని అధునాతన ఆతిథ్యాలయంగా తీర్చిదిద్దుతున్నారు.

నగరంలో స్టార్ హోటల్ కోసం చాన్నాళ్లుగా ఎదురుచూసిన ఆతిథ్యప్రియుల కోసం ఒక్కసారిగా రెండు 5స్టార్ హోటల్స్‌తో పాటుగా ఒక 4 స్టార్ హోటల్ కూడా అందుబాటులోకి రానుండడం శుభవార్త. ప్రస్తుత అంచనాల ప్రకారం ఈ మూడు హోటళ్ళ నిర్మాణానికి వాటి సారథులు సుమారు 400కోట్లకిపైగా పెట్టుబడి పెడుతున్నారు. ఈ మూడు హోటళ్ళ యజమానులు దేవిరెడ్డి సుధాకరరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, గిలకా నరేంద్రలు మన నెల్లూరువాళ్ళే కావడం గమనార్హం.. గర్వకారణం కూడా!

నెల్లూరు కబుర్లు

గణేష్‌ఘాట్ వద్ద..

24న.. మహా కార్తీక దీపోత్సవం

ఎమ్మెల్యే కోటంరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

కార్తీకమాసం సందర్భంగా ఈనెల 24న నెల్లూరులోని గణేష్‌ఘాట్ వద్ద పెద్దఎత్తున మహా కార్తీక దీపోత్సవం నిర్వహిస్తామని, భక్తులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈనెల 17న ఆయన గణేష్‌ఘాట్ వద్ద జరుగుతున్న కార్తీకదీపోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ఈ కార్యక్రమంలో భాగంగా మహిళలతో అత్యంత వైభవంగా శోభాయాత్ర నిర్వహిస్తామన్నారు. హరిద్వార్ నుంచి వచ్చే వేదపండితులతో 'గంగాహారతి' కార్యక్రమం కూడా చేపట్టనున్నామని చెప్పారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధికారప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మాజీ మేయర్ భానుశ్రీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిరోధానికి.. గట్టి చర్యలు తీసుకోవాలి

అధికారులకు కలెక్టర్ ఆదేశం



మాదకద్రవ్యాల నిరోధానికి జిల్లా అధికార యంత్రాంగం గట్టి చర్యలు చేపడుతోంది. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఈనెల 17న జిల్లా ఎస్పీ అజిత వేజెండ్లతో కలసి సమావేశమయ్యారు. గంజాయి తదితర మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలను అరికట్టేందుకు పటిష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని, డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని కలెక్టర్ అదేశించారు. అనుమానాస్పద ప్రాంతాల్లో పోలీసుల కార్డన్‌సెర్చ్ నిర్వహించాలన్నారు. డ్రగ్స్ సరఫరా చేసేవారిని గుర్తించి కఠినచర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ చెప్పారు. అడిషనల్ ఎస్పీ సిహెచ్ సౌజన్య, ఈగల్ అడిషనల్ ఎస్పీ స్వరూపరాణి, రూరల్ డీఎస్పీ శ్రీనివాస రావు, డిఎంఅండ్‌హెచ్ఓ డా.సుజాత తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలి

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశావర్కర్లకు కనీస వేతనం నెలకు 42 వేలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ కోరారు. వేతనాల పెంపు కోసం ఢిల్లీలో డిసెంబరు 1 నుంచి 3వతేదీ వరకు జరిగే నిరసనల్లో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

రైల్వే అండర్‌బ్రిడ్జి పనులను వేగవంతం చేయండి

నెల్లూరు రూరల్ నియోజక వర్గం పరిధిలో ఉన్న బీవీనగర్ రైల్వే అండర్‌బ్రిడ్జి పనులను వేగవంతం చేసి, త్వరితంగా పూర్తయ్యేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ చెప్పారు. ఈనెల 17న ఆయన రైల్వే అధికారులు, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ, విద్యుత్, పబ్లిక్‌హెల్త్ అధికారులతో కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమావేశమయ్యారు. బ్రిడ్జి నిర్మాణ పనులపై ఆయన సమీక్షించారు. ఆ పనులు త్వరితగతిన జరిగేందుకు వారికి తగు సూచనలిచ్చారు. ఈ సమావేశంలో టీడీపీ అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ధర్నా



విద్యార్థులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు నేటికీ విడుదల కాలేదని, దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారంటూ ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఈనెల 17న నెల్లూరు నగరంలో ధర్నాందోళన నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరేంద్ర మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్ళయినా విద్యారంగం సమస్యలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు త్రివిక్రమ్, యశ్వంత్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషిచేస్తాం

ఎమ్మెల్సీ బీద రవిచంద్ర



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, పక్కన గ్రంథాలయ చైర్‌పర్సన్ శాంతికుమారి

జిల్లాలోని గ్రంథాలయాలను అందరి సహకారంతో ఉన్నతంగా తీర్చిదిద్దుతామని జిల్లా టీడీపీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర చెప్పారు. 59వ జాతీయ గ్రంథాలయాల వారోత్సవాల సందర్భంగా ఆయన ఇటీవల నెల్లూరులోని రేబాలవారివీధిలో ఉన్న జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో, జిల్లా గ్రంథాలయాల చైర్‌పర్సన్ మేకపాటి శాంతికుమారితో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని 63 కేంద్రాల్లో ఉన్న గ్రంథాలయాలను, 2 గ్రామ గ్రంథాలయాలను గ్రంథాలయ చైర్‌పర్సన్ శాంతికుమారి ఆధ్వర్యంలో అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి, డీఈవో బాలాజీ పాల్గొన్నారు.

నెల్లూరు కార్పొరేషన్‌కి 'స్వచ్ఛ' అవార్డు

• రాష్ట్రంలోనే సరికొత్త రికార్డు



నెల్లూరు నగరపాలక సంస్థకి కేంద్ర ప్రభుత్వం మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్, ఫారెస్ట్ అండ్ క్లైమేట్ ఛేంజ్, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా 'స్వచ్ఛ' అవార్డును బహుకరించాయి. అవార్డుతో పాటు నగరపాలక సంస్థకి కేంద్రప్రభుత్వం 10 లక్షల రూపాయల ప్రోత్సాహక నగదు బహుమతిని కూడా అందజేసింది. ఈ వివరాలను కమిషనర్ ఈనెల 17న తెలియజేస్తూ, పరిశుభ్రత పర్యావరణ పరిరక్షణలో నగరం రాష్ట్రస్థాయిలోనే సరికొత్త రికార్డు సృష్టించిందని సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛాంధ్ర అవార్డులు-2026లో 3 సాధారణ అవార్డులతో పాటు, వాయు నాణ్యత పరిరక్షణలో నగదు బహుమతితో కూడిన ప్రత్యేక అవార్డును అందుకున్నామన్నారు. ఈ అవార్డులను విజయవాడలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతులమీదుగా అందుకున్నట్లు ఆయన వివరించారు. రాష్ట్రంలోనే ఇదొక సరికొత్త రికార్డు అని ఆయన అంటూ, అందుకు సహకరించిన పారిశుద్ధ్య సిబ్బందికి, అధికారులకు ఆయన అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో నెల్లూరు నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తామని తెలిపారు.

రెడ్ క్రాస్‌లో రక్తదాన శిబిరం



నెల్లూరులోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ కార్యాలయంలో ఈనెల 18న రక్తదాన శిబిరం నిర్వహించారు. నెల్లూరు యునైటెడ్ రౌండ్ టేబుల్-324 ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో ఆ సంస్థ చైర్మన్ మునగా సుజిత్ ఆధ్వర్యంలో సుమారు 50 మంది సభ్యులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. ముక్కాల తిలక్, కోట నిఖిల్, పేర్ల నిఖిలేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం రెడ్ క్రాస్ కో-ఆర్డినేటర్లు రంగయ్యనాయుడు, జనార్దన్‌రాజు తదితరులు రక్తదాతలను అభినందించారు.



'సాయి సచ్చరిత'..శోభాయాత్ర



నెల్లూరు బాలాజీనగర్ శివారుల్లోని శ్రీ సాయిబాబా అద్దాలమందిరం చైర్మెన్ మధుసాయి ఆధ్వర్యంలో ఈనెల 15న 'శ్రీ సాయి సచ్చరిత' శోభాయాత్ర కన్నుల పండువగా జరిగింది. తలపై సాయి సచ్చరిత గ్రంథాలను పెట్టుకుని సాయిభక్తులు నగర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. శ్రీ సాయి మాలధారణ మండలదీక్ష, షిరిడీయాత్ర సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు మూడువందల మంది సాయిభక్తులు మంగళవాద్యాల మధ్య సాయినామ సంకీర్తనలు చేస్తూ మందిరానికి వచ్చి శ్రీ సాయినాథుని దర్శించుకున్నారు. ఉభయకర్తల ఆధ్వర్యంలో స్వామి వారికి వైభవంగా పూజలు జరిగాయి. ఈ యాత్రలో పాల్గొన్నవారందరికీ శ్రీ సాయి సచ్చరిత గ్రంథాన్ని అందజేశారు. పాటోలు రామసుబ్బయ్య, సాయి భక్తబృందం ఈ వేడుకలను పర్యవేక్షించారు.



అయ్యప్పస్వామికి విశేష పూజలు

నెల్లూరు వేదాయపాళెంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో ఈనెల 17 నుంచి మండల పూజలు ప్రారంభమయ్యాయి. కేరళ సంప్రదాయం ప్రకారం స్వామి వారికి పడిపూజ నిర్వహించారు. క్షీరాభిషేకం, గణపతి హోమం, కలశపూజ ఉత్సవం వగైరాలన్నీ వేడుకగా జరిగాయి. అనంతరం మహాదీపారాధన చేశారు. ఆలయ అధ్యక్ష కార్యదర్శులు జి.శేషగిరి రావు, రత్తయ్య తదితరులు పర్యవేక్షించారు.

జాతీయ స్థాయి బిలియర్డ్స్‌కి..మురళీధర్



నెల్లూరుకు చెందిన యువ క్రీడాకారుడు మురళీధర్ స్నూకర్ మరియు బిలియర్డ్స్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గుంటూరులోని ఎల్వీఆర్ అండ్ సన్స్ క్లబ్ లో ఆంధ్రప్రదేశ్ స్నూకర్ అండ్ బిలియర్డ్స్ రాష్ట్ర స్థాయి పోటీలు జరిగాయి. అండర్ 21 విభాగంలో మురళీధర్ రెండు విభాగాల్లో తన సత్తాను చాటుతూ ఘనవిజయాన్ని సాధించారు. ఇలా ఒకేసారి రెండు విభాగాల్లో విజయాన్ని సాధించిన మొదటి క్రీడాకారుడిగా నిలవడం విశేషం.

మహనీయుల సేవలు మహోన్నతం

గ్రంథాలయోద్యమాలకి పితామహులైన అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, ఎస్ఆర్ రంగనాథన్ వంటి మహనీయుల సేవలు మహోన్నతమైనవని, అలాంటి వారి ఆశయాల బాటలో అందరూ నడవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజా అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఈనెల 16న నెల్లూరులోని కేంద్ర గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని వారి సేవలను వివరించారు. ఆ మహనీయులను స్మరించుకుంటూ వారి చిత్రపటాలకి నివాళులర్పించారు. గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరులో 'ఐకాన్' నిర్మాణానికి ప్రణాళికలు



ఐకాన్ నిర్మాణానికి ఆత్మకూరు బైపాస్‌రోడ్డుని పరిశీలిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

• మంత్రి ఆనం

ఆత్మకూరు బైపాస్‌రోడ్డులో సుందరమైన ఐకాన్‌ని నిర్మించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశించారు. ఇటీవల ఆయన ఆత్మకూరు బైపాస్‌రోడ్డు ప్రాంతాన్ని అధికారులతో కలసి పరిశీలించారు. జాతీయ రహదారి మీదుగా ఆత్మకూరు పట్టణంలోకి ప్రవేశించే ప్రయాణికులకు పట్టణ ప్రత్యేకతను చాటిచెప్పేలా, ఆకట్టుకునే రీతిలో ఐకాన్ నిర్మాణం చేపట్టేందుకు ఆయన పలు సూచనలు చేశారు. ఆత్మకూరు పట్టణానికి ఉన్న చారిత్రక నేపథ్యం, సాంస్కృతిక ప్రాధాన్యత, స్థానిక ప్రత్యేకతలు ప్రతిబింబించే విధంగా ఐకాన్ డిజైన్ రూపొందించాలని సూచించారు. పట్టణ సుందరీకరణలో ఈ నిర్మాణం ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా ఆధునిక నిర్మాణ శైలి, సుందరమైన రూపకల్పనతో ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.అందుకు అవసరమైన ప్రతిపాదనలు, నమూనాలను సిద్ధం చేసి తదుపరి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

'స్వచ్ఛ ఆంధ్ర' వైద్యులకు.. మంత్రి అభినందనలు

ఆత్మకూరులోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు 'స్వచ్ఛ ఆంధ్ర' పురస్కారం లభించడం పట్ల మంత్రి ఆనం హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా స్వచ్ఛ ఆంధ్ర పురస్కారాన్ని అందుకున్న ఆత్మకూరు జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌తో పాటు వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, ఆసుపత్రి సిబ్బందిని మంత్రి అభినందించారు.

శెభాష్..మరిన్ని అవార్డులు సాధించాలి

మంత్రి నారాయణను అభినందించిన చంద్రబాబు



అవార్డులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి చూపిస్తున్న మంత్రి నారాయణ

ఇటీవల జాతీయస్థాయిలో 6 స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు సాధించి, ఢిల్లీలో రాష్ట్రపతి చేతులమీదుగా వాటిని స్వీకరించిన మంత్రి నారాయణను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అభినందించారు. విశాఖపట్నంలో జరిగిన సీఐఐ సదస్సులో పాల్గొన్న మంత్రి నారాయణ ఆ అవార్డులను ముఖ్యమంత్రికి చూపించడంతో, ఆయన సంతోషంతో మంత్రిని, పురపాలకశాఖ అధికారులను ప్రశంసించారు. భవిష్యత్తులో మరిన్ని అవార్డులు సాధించాలని ఆకాంక్షిస్తూ, వారికి శుభాకాంక్షలు తెలిపారు.

కార్పొరేట్‌కి ధీటుగా కార్పొరేషన్ స్కూళ్లు!



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

• మంత్రి నారాయణ

కార్పొరేట్‌కి ధీటుగా కార్పొరేషన్ స్కూళ్ళు కూడా ఉండేవిధంగా పాఠశాలలను అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పురపాలక మంత్రి నారాయణ చెప్పారు. నెల్లూరు నగరాన్ని అభివృద్ధి చేయడమే తన ధ్యేయమని, 2028 నాటికి నెల్లూరును మోడల్ సిటీగా చేస్తానని అన్నారు. ఇటీవల ఆయన స్థానిక పరమేశ్వరి నగర్‌లో వక్ఫ్ బోర్డు స్థలంలో 20 కోట్ల సీఎస్ఆర్ నిధులతో నిర్మిస్తున్న అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ స్కూల్ పనులను రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వచ్చే విద్యా సంవత్సరంలోనే స్విమ్మింగ్ పూల్ వంటి అత్యాధునిక సదుపాయాలతో ఈ స్కూల్‌ను ప్రారంభిస్తామన్నారు. యువనేత నారా లోకేష్ ఆలోచనలకు అనుగుణంగా, విఆర్‌సి స్ఫూర్తితో దాతల సహకారంతో ఆర్ఎస్ఆర్, డీఎస్ఆర్ హైస్కూల్స్‌ను అద్భుతంగా తీర్చిదిద్దామని, ఒకదాన్ని మించి మరొకటి ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేసి, తన కుమార్తె శరణికి ఆధునీకరణ పనుల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించానని తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరంలో స్విమ్మింగ్ పూల్‌తో సహా అంతర్జాతీయ ప్రమాణాలతో అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ స్కూల్‌ను ప్రారంభిస్తామని, కార్పొరేషన్ పరిధిలోని అన్ని ప్రభుత్వ హైస్కూల్స్‌ను ఇదే స్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. తమది మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వమని అన్నారు. చెప్పిన దానికంటే ఎక్కువ అభివృద్ధి చేసి ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నామన్నారు. ఇటీవలే మేయర్‌గా గెలిచిన రూప్‌కుమార్‌యాదవ్, పలువురు నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

సొత్‌మోపూరు సర్పంచ్ అభ్యర్థిగా..

పముజుల వనజాక్షమ్మకి కోటంరెడ్డి మద్దతు



నెల్లూరు రూరల్ మండలంలోని సొత్‌మోపూరు గ్రామంలో పుట్టి, జిల్లాలోనే కాక రాష్ట్రవ్యాప్తంగా ఎందరో కష్టజీవులకు, నిరుపేద చేనేత కార్మికులకు అండగా నిలిచి వారి కష్టాలు తీర్చిన సీపీఐ సీనియర్ నాయకుడు దివంగత పముజుల దశరథరామిరెడ్డి సతీమణికి ఈసారి పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా పోటీ చేసే అవకాశం కల్పించి, పముజుల కుటుంబానికి మరింత గౌరవం తెచ్చారు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి. పముజుల దశన్న పేద కార్మికుల కోసం జీవితాంతం పోరాడారని, ఆయన ప్రజాసేవలను గుర్తుంచుకుంటూ, వారి సతీమణికి సొత్‌మోపూరులో సర్పంచ్‌గా పోటీచేసేందుకు, ఆమె అభ్యర్థిత్వానికి తాము మద్దతుగా నిలుస్తున్నామని శ్రీధర్ రెడ్డి తెలిపారు. దశన్న మరణాంతరం ఆయనకు ఇచ్చే గౌరవంలో భాగంగా, ఆయన సతీమణి వనజాక్షమ్మకి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని చెప్పారు. గ్రామంలోని అందరి మద్దతుతో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేయాలన్నదే తన లక్ష్యమని, అందుకు అందరూ కృషిచేయాలని ఆయన స్థానిక నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

కార్పొరేషన్ కొత్త పాలకవర్గం.. ప్రమాణస్వీకారం 23న

నెల్లూరు నగరపాలక సంస్థ కొత్త పాలకవర్గం ఈనెల 23న కొలువుదీరనుంది. ఈ నేపథ్యంలో ఈ సంస్థ చివరి సర్వసభ్య సమావేశం ఈనెల 21న నిర్వహించేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. ఆ రోజున ప్రస్తుతం ఉన్న కౌన్సిల్‌లోని కార్పొరేటర్లకు వీడ్కోలు పలకనున్నారు. 23వ తేదీన నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు. కొత్త మేయర్ ప్రమాణస్వీకారం చేసిన అనంతరం జరిగే సమావేశంలో డిప్యూటీ మేయర్‌ని, కోఆప్షన్ సభ్యులని కూడా ఎన్నుకోనున్నట్లు సమాచారం.

వేమిరెడ్డి దంపతుల సారధ్యంలో..

11వ 'లక్ష దీపోత్సవం'

డిసెంబరు 4,5,6 తేదీల్లో.. ఆధ్యాత్మిక వేడుకలు



భూమిపూజ చేస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి - ప్రశాంతిరెడ్డి దంపతులు

కార్తీకమాసం పర్వదినాలను పురస్కరించుకుని, నెల్లూరులో 11వ కార్తీక మాస లక్ష దీపోత్సవ నిర్వహణకు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి..కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు శ్రీకారం చుట్టారు. వీపీఆర్ ఫౌండేషన్ నిర్వహణలో ఈ వేడుకలు జరుగనున్నాయి. ఈనెల 16న వేమిరెడ్డి దంపతులు లక్షదీపోత్సవ కార్యక్రమానికి నగరంలోని వీఆర్‌సీ గ్రౌండ్‌లో శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం లక్ష దీపోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరించారు.

డిసెంబర్ 4, 5, 6 తేదీల్లో ఈ ఆధ్యాత్మిక వేడుకలు అత్యంత వైభవంగా జరగనున్నాయని, భక్తులు – ప్రజలు పెద్దసంఖ్యలో తరలిరావాలని వారు విజ్ఞప్తిచేశారు. డిసెంబర్ 4న పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతీ మహాస్వామి వారి చేతుల మీదుగా లక్ష దీపోత్సవం ప్రారంభం కానుందని వారు చెప్పారు. అదేవిధంగా, 5న స్వామివార్లకు విశేష అభిషేకాలు, అర్చనలు, సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి 108మంది దంపతులతో 108 కేజీల తేనెతో విశేష అభిషేకం, ప్రత్యేక పూజలు, రుద్రహోమం నిర్వహించనున్నారు. అదేరోజు లక్ష్మీ నరసింహస్వామివారికి గంధం అలంకరణ మహోత్సవం, లక్ష తులసీ అర్చన ఉంటాయని, 6వ తేదీన చండీహోమంతో పాటు 501మంది దంపతులతో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించనున్నామన్నారు. అనంతరం, శ్రీశైలం నుంచి తీసుకరానున్న ఉత్సవమూర్తులతో శివపార్వతుల కల్యాణ మహోత్సవం జరగనుందని తెలిపారు.

కనువిందుగా ఏర్పాటుకానున్న 'ఆలయ నమూనాలు'

ఈ ఏడాది ఉత్సవాల్లో కనువిందుగా ప్రత్యేక ఆలయ నమూనాలు ఉంటాయని, రామేశ్వరం జ్యోతిర్లింగం, అహోబిలం లక్ష్మీనరసింహస్వామి నమూనా క్షేత్రాలు అందరినీ ఆకట్టుకునేవిధంగా ఏర్పాటుచేస్తున్నామని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తెలిపారు. ప్రధాన ఆకర్షణగా నిలిచే 9 అడుగుల భారీ శివలింగానికి భక్తులందరూ స్వయంగా అభిషేకం చేసుకునే అవకాశం కల్పిస్తున్నామని కూడా ఆమె వెల్లడించారు. మూడు రోజుల పాటు పరమశివునికి ప్రీతిపాత్రమైన దీపారాధన, రుద్రాభిషేకం, భస్మాభిషేకం వంటి విశేష సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

గూడూరు డివిజన్

ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

గూడూరు పట్టణంలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్లు పూర్తయ్యాయి. గూడూరు ఛైర్‌పర్సన్ పోటీకి 12 మంది అభ్యర్థులు నామినేషన్ వేయగా, టిడిపి నుంచి ముగ్గురు, వైసీపీ నుంచి ఆరు మంది, బీఎస్పీ నుంచి ఒకరు, కాంగ్రెస్ నుంచి ఇద్దరూ నామినేషన్‌లు వేయడం జరిగింది. అదేవిధంగా 48 వార్డులకు గాను మొత్తం 299మంది కౌన్సిలర్ అభ్యర్థులుగా నామినేషన్ వేయడం జరిగింది. బీజేపీ నుంచి 14 మంది, సిపిఐ నుండి 5, కాంగ్రెస్ నుండి 14, టిడిపి నుండి 129, వైసీపీ నుండి 94, జనసేన నుండి 18 మంది నామినేషన్ దాఖలు చేశారు. పదేళ్ల తర్వాత జరుగుతున్న ఎన్నికలు కావడంతో ఆశావహులందరూ భారీఎత్తున నామినేషన్లు వేయడం విశేషం!

విద్యార్థులకి అక్షరాస్యత క్లబ్ క్విజ్ పోటీలు

అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి ఎన్నికల అక్షరాస్యత క్లబ్ ఆధ్వర్యంలో గూడూరులోని డిఆర్‌డబ్ల్యూ జూనియర్ కళాశాలలో ఈ నెల 16వ తేదీ వ్యాసరచన మరియు క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఎన్నికల ప్రక్రియ, భారత ప్రజాస్వామ్య వ్యవస్థ, ఓటు హక్కు ప్రాముఖ్యత, ఎన్నికల్లో యువత పాత్ర, నైతిక ఓటింగ్ వంటి అంశాలపై పోటీలు నిర్వహించారు. విద్యార్థుల్లో ఎన్నికలపై అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన కళాశాల ప్రిన్సిపల్ డి.సత్యవతి, అధ్యాపక బృందాన్ని నిర్వాహకులు అభినందించారు.

రాజ్యలక్ష్మమ్మని సత్కరించిన మహిళా మండలి



గూడూరు పట్టణంలో నూతనంగా నిర్మించిన ఆంధ్ర మహిళా మండలి భవనానికి ఇటీవల ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యురాలు శ్రావ్య సౌండ్‌సిస్టంను, అలాగే సీనియర్ సభ్యురాలు సౌందర్యమ్మ బీరువాను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా వీరిని ఇన్నర్‌వీల్ అధ్యక్షురాలు కె.నిర్మల అభినందించారు. అనంతరం సీనియర్ సభ్యురాలు శ్రీకంటి రాజ్యలక్ష్మమ్మను క్లబ్ సభ్యులు సన్మానించారు. ఆంధ్ర మహిళా మండలి అధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి, కార్యదర్శి సుప్రియ, విష్ణువందన, ప్రభ, సుప్రభా, సౌజన్యమ్మ, శశికళ, మెహర్మణి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకి బహుమతులందజేస్తున్న డాక్టర్ సి.జనార్దన్‌రెడ్డి

రోటరీ వక్తృత్వ పోటీలు

గూడూరు, రోటరీ భవనంలో చిల్డ్రన్స్ డే సందర్భంగా ఈ నెల 14న రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణ, పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను తోట సురేష్‌నాయుడు దాతృత్వంతో కార్యక్రమ ముఖ్యఅతిథి డాక్టర్ జనార్దన్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. అధ్యక్షులు సురేష్‌రెడ్డి, కార్యదర్శి నాగసునీల్ కుమార్, దశరథరామిరెడ్డి, బాలకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

హాకీ క్రీడాకారులకి నగదు ప్రోత్సాహకం

గూడూరులోని డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్లో రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ శ్రీలక్ష్మి – పీఎం రావు దంపతుల దాతృత్వంతో ఇటీవల పట్టణంలోని హాకీ క్రీడాకారులకు పౌష్టికాహారం కోసం నగదును అందజేశారు. హాకీలో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనపరిచిన క్రీడాకారులను వారు ప్రత్యేకంగా అభినందించారు. క్లబ్ అధ్యక్షులు ఎన్.కృష్ణంరాజు, వాసుగౌడ్, నాసిన నాగులు పాల్గొన్నారు.



నగదు ప్రోత్సాహకాలతో హాకీ క్రీడాకారులు

తొలి సినిమాతోనే.. అదరగొట్టిన నెల్లూరు బుల్లోడు!



మూగవాడి పాత్రలో అనీష్ అభినయం.. అనస్వర అందం.. తమన్ సంగీతం.. దర్శకుడి ప్రతిభతో ఆకట్టుకున్న 'ఇట్లు అర్జున'

ఆ యువ హీరో తన సత్తా చూపించాడు! ఆ కొత్త కుర్రాడు తన నటనతో అదరగొట్టాడు!! ఆ యంగ్ స్టార్ తన తొలి ప్రయత్నంలోనే తెలుగు ప్రేక్షకుల మనసు దోచుకున్నాడు!!! మొదటి సినిమాలోనే మాటలు రాని యువకుడి పాత్రను ఎంచుకుని, సంభాషణలు లేకుండానే హావభావాలతో ప్రేక్షకులను మెప్పించడం అనీష్ చేసిన సాహసం. ఆ సాహసానికి తన సహజమైన నటనతో న్యాయం చేసి మన నెల్లూరు బుల్లోడు అల్తూరు అనీష్ శభాష్ అనిపించుకున్నాడు. 'ఇట్లు అర్జున'తో వెండితెరకు పరిచయమైన ఈ యువ కథానాయకుడు తొలి అడుగులోనే తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు.

ఘాటైన ప్రేమకథకి ధీటైన క్రైమ్ థ్రిల్లర్ మలుపు!

అర్జున్ (అనీష్) చిన్నప్పటి నుంచి మాటలు రాని యువకుడు. తండ్రితో కలిసి చిన్నచిన్న దొంగతనాలు చేస్తూ పెరిగిన ఆ కుర్రోడు , తండ్రి మరణం తర్వాత ఆ జీవితానికి స్వస్తి చెప్పాలని నిర్ణయించుకుంటాడు. తన అపార్ట్‌మెంట్‌లోనే నివసించే కీర్తి (అనస్వర రాజన్)ను చిన్నప్పటి నుంచి మనసారా ప్రేమిస్తుంటాడు. అయితే తాను మూగవాడు, తన ప్రేమని మాటలతో చెప్పలేడు. అలాంటి పరిస్థితులలో జరిగే ఓ సంఘటనతో అర్జున్ కీర్తికి దగ్గరవుతాడు. ఇద్దరు మంచి స్నేహితులలా కలిసిపోతారు. కానీ, అర్జున్ మనసులో తన చిన్ననాటి నుండీ కీర్తిపై వున్న అపారమైన మూగ ప్రేమని కీర్తి గ్రహించలేకపోతుంది.

వీరిద్దరి కథ ఇలా సాగిపోతుండగా.. హైదరాబాద్‌లో పేరుమోసిన గ్యాంగ్‌స్టర్ పెద్దన్న (ముఖేష్ రిషి)కు సంబంధించిన సుమారు వెయ్యి కోట్ల హవాలా వ్యవహారంలో ఓ పెన్‌డ్రైవ్ కీలకంగా మారుతుంది. అనూహ్య పరిణామాల మధ్య అర్జున్, కీర్తి ఈ క్రైమ్ వ్యవహారంలో చిక్కుకుంటారు. ఆ తర్వాత వారిద్దరూ ఎదుర్కొనే కష్టాలు, గ్యాంగ్‌స్టర్ల వేట, ప్రేమ, భావోద్వేగాలు కథను ఆసాంతం ఆసక్తికరంగా ముందుకు నడిపిస్తాయి.

దర్శకుడి ఆలోచన అమోఘం!

దర్శకుడు మహేష్ ఉప్పాల ఎంచుకున్న కథాంశం కొత్తగా ఉంది. మాటలు రాని యువకుడి ప్రేమకథకి గ్యాంగ్‌స్టర్ నేపథ్యాన్ని జోడించి రొమాన్స్, కామెడీ, యాక్షన్, థ్రిల్లర్ అంశాలను మేళవించడం మంచి ప్రయత్నం. ముఖ్యంగా సినిమా తొలి భాగంలో ప్రేమ కథ, వినోద సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. కొన్ని ఊహించని మలుపులతో కథనాన్ని ఆసక్తికరంగా నడిపించారు. ద్వితీయార్థంలో క్రైమ్ ట్రాక్ మరింత బలంగా ఉండి, కొన్ని సన్నివేశాలు కాస్త సంక్షిప్తంగా ఉండి ఉంటే సినిమా ప్రభావం ఇంకా పెరిగేది. అయినప్పటికీ తొలి చిత్రంతోనే భిన్నమైన కథను ఎంచుకున్న దర్శకుడు మహేష్ ఉప్పాల ఆలోచన అమోఘం.

అనస్వర రాజన్ అభినయం ప్రత్యేక ఆకర్షణ!

కథానాయిక కీర్తి పాత్రలో మలయాళ నటి అనస్వర రాజన్ చక్కగా ఒదిగిపోయింది. చలాకీతనం, అందమైన హావభావాలు, సహజమైన నటనతో తెరపై సందడి చేసింది. అర్జున్‌తో ఆమె కెమిస్ట్రీ బాగుంది. ముఖ్యంగా ఇద్దరి మధ్య ప్రేమను వ్యక్తపరిచే సన్నివేశాలు హృద్యంగా ఉంటాయి. కొన్ని హాస్య సన్నివేశాల్లోనూ ఆమె నటన ఆకట్టుకుంటుంది. అనీష్‌కు దీటుగా తన పాత్రను సమర్థంగా పోషించి సినిమాకు మరో ఆకర్షణగా నిలిచింది. అసలు మాటలే రాని యువకుడు (అర్జున్) పక్కన గలగలా మాట్లాడే యువతిగా కీర్తి పాత్రకి ప్రాధాన్యతని కల్పించి దర్శకుడు చక్కగా బ్యాలన్స్ చేశాడు.

సహాయ నటుల సందడి!

పెద్దన్న అనే గ్యాంగ్‌స్టర్ పాత్రలో ముఖేష్ రిషి తనదైన శైలిలో కనిపించగా, వెన్నెల కిషోర్ తన కామెడీ టైమింగ్‌తో నవ్వులు పూయించాడు. బ్రహ్మాజీ, గెటప్ శ్రీను తమ పాత్రలతో వినోదాన్ని పంచారు. కలైయరసన్ గౌరి పాత్రలో, ఎలాంగో కుమారవేల్ ఇరానీ పాత్రలో మెప్పించారు. ఇతర నటీనటులు కూడా కథకు అవసరమైన సహకారం అందించారు.

తమన్ సంగీతం.. సినిమాకు ప్రాణం!

ఈ సినిమాకు సంగీత దర్శకుడు తమన్ అందించిన పాటలు, నేపథ్య సంగీతం ప్రధాన బలంగా నిలిచాయి. ముఖ్యంగా మాటలు పలకలేని కథానాయకుడి భావాలను ప్రేక్షకులకు చేరవేయడంలో నేపథ్య సంగీతం కీలకపాత్ర పోషించింది. ప్రేమ సన్నివేశాల్లో మధురమైన సంగీతంతో భావోద్వేగాలను మరింత అందంగా పలికించారు. ఉత్కంఠభరిత సన్నివేశాల్లో తనదైన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో వేగాన్ని పెంచారు. కొన్ని చోట్ల కథనంలోని లోపాలను కూడా తన సంగీతంతో కప్పిపుచ్చే స్థాయిలో తమన్ ప్రతిభ కనిపిస్తుంది. ఈ చిత్రానికి తమన్ సంగీతం నిజంగా ఓ ప్రత్యేక ఆకర్షణ. రాజా మహదేవన్ సినిమాటోగ్రఫీ కూడా బాగుంది. ముఖ్యంగా రొమాంటిక్ సన్నివేశాలను అందంగా తెరకెక్కించారు. నిర్మాణ విలువలు ఉన్నతంగా ఉన్నాయి.

అనీష్‌కి ఇది ఆరంభం మాత్రమే!

మొత్తంగా 'ఇట్లు అర్జున' ఓ విభిన్నమైన ప్రేమ కథకు క్రైమ్, యాక్షన్, వినోదాన్ని జోడించిన ఆసక్తికరమైన ప్రయత్నం. అనీష్ నటన, అనస్వర రాజన్ అభినయం, తమన్ సంగీతం సినిమాను కుటుంబ సమేతంగా చూడదగిన చిత్రంగా నిలబెట్టాయి. ముఖ్యంగా తొలి సినిమాతోనే ఇంతటి సవాలుతో కూడిన పాత్రను ఎంచుకున్న అనీష్‌ను అభినందించకుండా ఉండలేం. మాట్లాడలేని పాత్రలో సైతం తన భావాలతో ప్రేక్షకులతో మాట్లాడగలిగాడు. నటుడిగా అనీష్‌లో మంచి భవిష్యత్తుకు అవసరమైన ప్రతిభ కనిపిస్తోంది.

సింహపురి నుంచి సినీ సీమలోకి అడుగుపెట్టి తొలి చిత్రంతోనే తనదైన ముద్ర వేసిన అల్తూరు అనీష్‌కు అభినందనలు. అనీష్‌కి ఇది ఆరంభం మాత్రమే. రాబోయే రోజుల్లో మరిన్ని వైవిధ్యమైన పాత్రలతో తెలుగు ప్రేక్షకులను అలరించాలని కోరుకుందాం.

శెభాష్ అనీష్!

- శివ

యువ పారిశ్రామికత : స్వప్నాలను సాకారం చేసే సాహసయాత్ర

నేటి ఆధునిక ప్రపంచంలో చదువు పూర్తవగానే ఉద్యోగంలో స్థిరపడాలనే సంప్రదాయ ఆలోచనా ధోరణిలో పెను మార్పు వస్తోంది. 'నేనే పదిమందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలి' అనే బలమైన సంకల్పం ప్రపంచవ్యాప్తంగా ఉన్న యువతలో నాటుకుంటోంది. దేశ ఆర్థిక ప్రగతికి వెన్నెముకగా నిలిచేది ఈ యువశక్తే. కలను కనడం ఎంత సులభమో, దానిని వాస్తవ రూపంలోకి తీసుకురావడం అంతే సవాలుతో కూడుకున్నది. నిద్రలో వచ్చేవి కావు కలలు, మనల్ని నిద్రపోనివ్వనివే నిజమైన కలలు! అటువంటి కలలను సాకారం చేసుకునే దిశగా యువత వేసే ప్రతి అడుగు ఒక సాహసయాత్రే. చాలామంది సాధారణ వ్యాపారానికి, పారిశ్రామికతకు మధ్య ఉన్న సూక్ష్మమైన తేడాను గుర్తించలేరు. ఉన్న వస్తువులను ఒకచోట కొని మరోచోట అమ్మడం సాధారణ వ్యాపారమైతే, సమాజంలోని ఒక క్లిష్టమైన సమస్యను గుర్తించి, దానికి వినూత్న పరిష్కారాన్ని అందిస్తూ, నష్టభయాన్ని స్వీకరించి కొత్త విలువను సృష్టించడమే అసలైన పారిశ్రామికత. ఒక యువకుడు లేదా యువతి పారిశ్రామికవేత్తగా ఎదగాలంటే కొన్ని మౌలిక సూత్రాలపై అవగాహన పెంచుకోవాలి.

ప్రతి విజయవంతమైన స్టార్టప్ వెనుక ఒక బలమైన సమస్య ఉంటుంది. మన చుట్టూ ఉన్న ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను నిశితంగా గమనించడం మొదటి మెట్టు. ఆ సమస్యకు ఇతరులకంటే భిన్నంగా, సులభంగా, తక్కువ ఖర్చుతో కూడిన వినూత్న పరిష్కారాన్ని కనుగొనాలి. అయితే గొప్ప ఆలోచన ఉంటే సరిపోదు; మనం అందించే వస్తువు లేదా సేవకు మార్కెట్‌లో ఎంత డిమాండ్ ఉంది, వినియోగదారులు దానిని ఆదరిస్తారా లేదా అనేది ముందే విశ్లేషించుకోవాలి. వీటన్నింటికీ తోడు ఆర్థిక క్రమశిక్షణ అత్యంత కీలకం. పెట్టుబడి ఎంత అవసరం, ఖర్చులను ఎలా నియంత్రించాలి, లాభాలను తిరిగి సంస్థ అభివృద్ధికి ఎలా మళ్లించాలి అనే స్పష్టమైన ప్రణాళిక ఉన్నప్పుడే ఏ సంస్థ అయినా దీర్ఘకాలం మనుగడ సాగించగలదు. యువత తలుచుకుంటే అసాధ్యం అనేది లేదని నిరూపించిన ఎందరో యువ పారిశ్రామికవేత్తలు ప్రపంచ వ్యాప్తంగా స్ఫూర్తిగా నిలుస్తున్నారు. కేవలం 19 ఏళ్ల వయసులో భారతదేశంలోని బడ్జెట్ హోటళ్లలో ఉన్న అపరిశుభ్రత, నాణ్యత లోపాన్ని గుర్తించిన రితేష్ అగర్వాల్, సామాన్యులకు అందుబాటు ధరలో నాణ్యమైన వసతి కల్పించాలనే ఆలోచనతో 'ఓయో రూమ్స్'ను ప్రారంభించి ప్రపంచ స్థాయి నెట్‌వర్క్‌గా తీర్చిదిద్దారు. అమెరికాలో చదువుకుంటున్న రోజుల్లోనే, ఇరవై ఏళ్ల వయసులో మార్క్ జుకర్‌బర్గ్ తన కళాశాల హాస్టల్ గది నుండే 'ఫేస్‌బుక్'కు శ్రీకారం చుట్టి ప్రపంచ కమ్యూనికేషన్ రూపురేఖలనే మార్చివేశారు. చిన్ననాటి అభిరుచిని మహా సామ్రాజ్యంగా మార్చవచ్చని నిరూపించిన మరో అమెరికన్ యువకుడు పల్మర్ లక్కీ కేవలం 16 ఏళ్ల వయసులోనే తన తల్లి దండ్రుల గ్యారేజీలో కూర్చుని వర్చువల్ రియాలిటీ ప్రయోగాలు చేసి 'ఆక్యులస్ వీఆర్' సంస్థను స్థాపించి, 21 ఏళ్లకే బిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లారు. ఆన్‌లైన్ చెల్లింపులు ఎంత క్లిష్టంగా ఉన్నాయో గమనించిన పాట్రిక్ మరియు జాన్ కొలిసన్ అనే యువ సోదరులు తమ ఇరవై ఏళ్ల ప్రారంభంలోనే 'స్ట్రైప్' సంస్థను స్థాపించి డిజిటల్ చెల్లింపులను సులభతరం చేశారు. ఇటు భారతదేశంలో కోవిడ్ సమయంలో నిత్యావసర సరుకుల డెలివరీలో జరుగుతున్న జాప్యాన్ని గమనించిన ఆదిత్ పాలిచా, కైవల్య వోహ్రా అనే 19ఏళ్ల యువకులు, కేవలం పది నిమిషాల్లో సరుకులను చేర్చే 'జెప్టో' సంస్థను స్థాపించి అతి తక్కువ కాలంలోనే బిలియన్ డాలర్ల సంస్థగా నిలబెట్టారు. సామాజిక మరియు గ్రామీణ స్థాయిలోనూ యువత అద్భుతాలు చేస్తోంది. అమెరికాలో బ్లేక్ మైకోస్కీ తన 'టామ్స్ షూస్' ద్వారా ప్రతి జత బూట్ల అమ్మకంపై పేద పిల్లలకు ఒక జత ఉచితంగా అందించే వినూత్న వ్యాపార నమూనాను పరిచయం చేస్తే, మన తెలుగు రాష్ట్రాల యువత సేంద్రీయ వ్యవసాయం, చిరుధాన్యాల ఉత్పత్తుల ఆధునిక ప్యాకేజింగ్, చేనేత వస్త్రాలను ఆన్‌లైన్ వేదికల ద్వారా అంతర్జాతీయ మార్కెట్‌కు పరిచయం చేస్తూ స్థానికంగా ఉపాధి సృష్టిస్తోంది. ఇలాంటి వినూత్న ఆలోచనలు నేటి యువతకు కొండంత ఆత్మవిశ్వాసాన్ని ఇస్తున్నాయి.

వ్యాపార ప్రయాణంలో వైఫల్యాలు సహజం. ప్రతి ఓటమిని ఒక గుణపాఠంగా మలుచుకుని ముందుకు సాగాలి. విజయం అనేది అంతిమ గమ్యం కాదు, వైఫల్యం అనేది ప్రాణాంతకం కాదు; ఎన్ని అడ్డంకులు ఎదురైనా ముందుకు సాగే ధైర్యమే ముఖ్యం. కృత్రిమ మేధస్సు వంటి ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా నిరంతరం కొత్త విషయాలను నేర్చుకోవాలి. సమర్థవంతమైన బృందాన్ని నిర్మించుకుని, వారిలో స్ఫూర్తిని నింపుతూ లక్ష్యం వైపు నడిపించే నాయకత్వ లక్షణాలు, పట్టుదల విజయానికి సోపానాలుగా మారుతాయి. పెట్టుబడి లేమి, అనుభవ రాహిత్యం, కుటుంబం నుండి వచ్చే ఒత్తిడి వంటి సవాళ్లను అధిగమించడానికి నేడు ఎన్నో మార్గాలు ఉన్నాయి. భారతదేశంలో 'స్టార్టప్ ఇండియా', 'ముద్ర యోజన', 'టి-హబ్' వంటి వేదికలు, అమెరికాలో 'వై కాంబినేటర్', 'టెక్‌స్టార్స్' వంటి యాక్సిలరేటర్లు, ఏంజెల్ ఇన్వెస్టర్లు కొత్త ఆలోచనలకు అండగా నిలుస్తున్నాయి. ఈ అవకాశాలను అందిపుచ్చుకుని చిన్న స్థాయిలోనైనా తమ ప్రయాణాన్ని ప్రారంభించడం ఎంతో ముఖ్యం. అనుభవం కోసం కళాశాల రోజుల నుండే స్టార్టప్‌లలో ఇంటర్న్‌షిప్‌లు చేయడం, హ్యాకథాన్‌లు, బిజినెస్ ప్లాన్ పోటీలలో పాల్గొనడం వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

కెరటం మనకు ఎప్పుడూ ఆదర్శంగా నిలవాలి..అది విరిగి పడుతున్నందుకు కాదు, పడినా తిరిగి రెట్టింపు ఉత్సాహంతో లేస్తున్నందుకు! నేటి యువత కేవలం ఉద్యోగాల కోసం ఎదురుచూసే 'జాబ్ సీకర్స్'గా కాకుండా, నలుగురికి ఉపాధి కల్పించే 'జాబ్ క్రియేటర్స్'గా మారాలి. సాహసం లేనిదే విజయం లేదు. సరికొత్త ఆలోచనలతో, అకుంఠిత దీక్షతో అడుగు ముందుకు వేస్తే, రేపటి ప్రపంచాన్ని శాసించే పారిశ్రామికవేత్తలు మన మధ్య నుండే ఉద్భవిస్తారు. స్వప్నాలను సాకారం చేసుకునే ఈ సాహసయాత్రకు నేడే శ్రీకారం చుట్టండి!



వచ్చే వారం : ఆలోచన నుండి ఆవిష్కరణ వరకు : సృజనాత్మక దృక్పథమే విజయానికి సోపానం

E-mail: reddyu@gmail.com

ఎన్‌బీకేఆర్‌లో ప్రాంగణ ఎంపికలు

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 16న ప్రాంగణ ఎంపికలు జరిగాయి. బెంగళూరుకు చెందిన ఎం-కోర్ కంపెనీవారు, ఎలక్ట్రికల్ విభాగంలో ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలకు సంబంధించిన పరీక్షలు పెట్టారు. మొత్తం 56 మంది విద్యార్థులు హాజరుకాగా, మొదటి రౌండ్ రాతపరీక్షలో 24 మంది షార్ట్‌లిస్ట్ అయ్యారు. రెండవరౌండ్ వర్చువల్ టెక్నికల్ హెచ్‌ఆర్ ఇంటర్వ్యూలో 13మంది ఉత్తీర్ణులయ్యారు. ఆ కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎంపికలు జరిగాయి. ఎంపికైన విద్యార్థులకు వచ్చే జనవరి నుంచి ఆన్‌లైన్‌లో ఇంటెన్సివ్ ట్రైనింగ్ ఇస్తారు. చివరి సంవత్సరం చదువు పూర్తయిన తర్వాత, ఆ విద్యార్థులను ఉద్యోగాల్లో చేర్చుకుంటారు. ఉద్యోగం పొందినవారికి సంవత్సర వేతనం సుమారు 3.5 లక్షల రూపాయలుంటుందని ప్రిన్సిపాల్ డా. శ్రీనివాసులు తెలిపారు. ప్రాంగణ ఎంపికల అధికారి డా.ఎన్.కిషాందర్ పాల్గొన్నారు.



బతుకాలి

ఓ సర్వేశ్వరా -
నీవు అందరి దగ్గర ఉండలేవని
నీకు బదులు వైద్యుణ్ణి పంపావు
అమ్మ కడుపులో బిడ్డ దైన్యానికి
మొదట పలికే ఆరాధ్యుడు వైద్యుడే

మనిషిని మరణశయ్య కల్లోలం నుంచి
మళ్ళీ కలల దీప్తుల పరిభాషలోకి
మార్పు చేయగల ధీశాలి అతగాడే

ఇంట్లో చీకట్లు కమ్మినా
దీపం వెల్గించే వెలుగుపూల నేస్తం
కన్నీటి చుక్కల్ని వర్షపు చినుకుగా
మార్చే సామర్థ్యం వారిదే

రోగి గుండెల చప్పళ్ళలో
పరమార్థం గ్రహించి
గుండెను పణంగా పెట్టే
చతురత కూడా వాళ్ళదే

పాము తన బిడ్డల్ని తానే క్రింగి
ధ్వంసం చేసి తిన్నట్లు
సృష్టించిన పైరును
తుఫాన్ల జడివాన మింగేసినట్లు

ధన్వంతర్లకే అకాల మరణం రాస్తే
చేతులకు ఉరితాడు బిగిస్తే -

విశ్వేశ్వరా నీకిది తగునా
అస్పత్రుల శకలాల ఘోష
నీకు తగలదా
అమ్మ ఒడిలోని బిడ్డ
ఆవేదనల సెగలు మిన్నంటి నిన్ను తాకవా

డాక్టర్ లేని లోకంలో
కరుణకు ఎల్‌నినో సోకి బీడైపోదా
సేవ అనే పదానికి
త్రోవే కరువై వైరస్‌కు నెలవవ్వదా

డాక్టర్లు కలకాలం బ్రతకాలి
దేవుడితో యుద్ధం చేస్తూ గెలవాలి
అప్పుడే ప్రేమ బతుకుతుంది
మానవ సమాజం వికసిస్తుంది

పరమాత్ముని ఆటలకు
పావులుగా నిలుస్తుంది
హే భగవాన్ క్షమించు మమ్మల్ని...
కరుణించు.. అనుగ్రహించు

(డా॥ లావణ్య స్మృతిలో...)



డా॥ లావణ్య



'కళారత్న'
చిన్ని నారాయణరావు
94402 02942

సమిష్టి కృషితో..

విజయం సాధించాలి

పంచాయతీ నాయకులకు ఎమ్మెల్యే కాకర్ల దిశానిర్దేశం



పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఉదయగిరి నియోజకవర్గంలోని కొండాపురం, కలిగిరి, వింజమూరు మండలాలకు చెందిన పలువురు పంచాయతీ నాయకులతో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఈనెల 15న సమావేశమై వారికి దిశానిర్దేశం చేశారు. వింజమూరు మండలం బొమ్మరాజుచెరువు గ్రామంలోని తమ క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో కాకర్ల మాట్లాడుతూ, ఆయా మండలాల్లోని గ్రామ పంచాయతీల వారీగా రాజకీయ పరిస్థితులు, క్షేత్రస్థాయిలో పార్టీ బలాబలాలు, నాయకులు మరియు కార్యకర్తల పనితీరు, ప్రజల అభిప్రాయాలు తదితర అంశాలపై నాయకులతో చర్చించారు. గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. స్థానిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఎన్నికలకు సమర్థవంతమైన ప్రణాళికతో సిద్ధం కావాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు. సమష్టి కృషి, ఐక్యత, సమన్వయంతో ముందుకు సాగడం విజయానికి కీలకమని పేర్కొంటూ, గ్రామస్థాయిలో పార్టీ శ్రేణులందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

మామిడికి 'బీమా' పథకం

ప్రకృతి వైపరీత్యాల వల్ల, ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల మామిడికి నష్టాలు జరిగినప్పుడు రైతులు ఆర్థికంగా నష్టపోకుండా భరోసా కల్పించేందుకు పునర్వ్యవస్థీకరించిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం (ఆర్‌డబ్ల్యుబీసీఐఎస్) ఎంతగానో ఉప యోగపడుతుందని జిల్లా ఉద్యాన అధికారి యమ్.వి.సుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు నిర్ణీత గడువు లోపల పంట బీమా నమోదు చేసుకోవాలని, మామిడి పంటకు ఎకరాకు రూ.2250లను డిసెంబర్ 31వ తేది లోపు చెల్లించాలని ఆయన తెలిపారు. అధిక ఉష్ణోగ్రతలు, అధిక వర్షాలు, ఈదురుగాలులు, తెగుళ్ళు కారణంగా దిగుబడి తగ్గితే ఈ బీమా వర్తిస్తుందని, ప్రతి రైతు తమ పంట సాగు వివరాలను ఈ-క్రాప్ లో తప్పకుండా నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

రత్నం మాస్టారి ఆశయ బాటలో నడవాలి

• 'ఫాస్టీ' శుభప్రవేశ వేడుకలో వేమిరెడ్డి దంపతులు



కార్యక్రమంలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి, రూప్‌కుమార్‌యాదవ్ తదితరులు

నాణ్యమైన విద్యతో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలని, విద్యాదాత.. దివంగత కేవీ రత్నం మాస్టారు విద్యా సేవల వారసత్వాన్ని కొనసాగించాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి.. కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పిలుపునిచ్చారు. ఈనెల 16న ముత్తుకూరు మండలం పిడతాపోలూరులో ఏర్పాటు చేసిన ఫాస్టీ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యాలయం శుభప్రవేశ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీపీఆర్ దంపతులు మాట్లాడుతూ.. విద్యారంగంలో విశేష సేవలు అందించిన కేవీ రత్నం మాస్టారి వారసులు ఏర్పాటు చేస్తున్న ఈ పాఠశాల విద్యారంగంలో మంచి గుర్తింపును పొందాలని ఆకాంక్షించారు. ఫాస్టీ ఇంటర్నేషనల్ స్కూల్ నెల్లూరు విద్యా రంగంలో నూతన ప్రమాణాలను నెలకొల్పాలని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యావేత్త డాక్టర్ కృష్ణ కిషోర్ కుమార్తె రోషిణి, అంబికా ఈశ్వర్ దంపతులు ఈ విద్యాసంస్థను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లాలని, కేవీ రత్నం మాస్టారు విద్యారంగంలో అందించిన సేవలు, నెలకొల్పిన విలువలను, ఆయన ఆశయాలను వారి వారసులు కొనసాగించాలని విపిఆర్ దంపతులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నగర నూతన మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

శ్రీసిటీని సందర్శించిన జపాన్ ప్రతినిధి బృందం



జపాన్ బృందంతో శ్రీసిటీ ఎం.డి డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి

జపాన్‌లోని ఎహిమే రాష్ట్రానికి చెందిన 11 మంది సభ్యుల వ్యాపార ప్రతినిధి బృందం ఈనెల 18న శ్రీసిటీని సందర్శించింది. భారత్‌లో వ్యాపార విస్తరణ, పెట్టుబడి అవకాశాల పరిశీలనలో భాగంగా ఆ ప్రాంత సీనియర్ ప్రభుత్వ అధికారులు యమటో ఇకెడా, అకిరా మౌరి నేతృత్వంలో ఈ బృందం విచ్చేసింది. చెన్నైలోని జపాన్ కాన్సులేట్ జనరల్ వైస్ కాన్సుల్ షున్ సకాయ్ ఈ పర్యటనను సమన్వయం చేశారు. ఈ బృందానికి స్వాగతం పలికిన శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, శ్రీసిటీ అత్యుత్తమ మౌలిక సదుపాయాలు, వివిధ పారిశ్రామిక రంగాలు, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు, పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం గురించి వారికి వివరించారు. యునిచార్మ్ సహా 35కి పైగా జపాన్ కంపెనీలు ఇప్పటికే శ్రీసిటీలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా చిన్న, మధ్యతరహా పరిశ్రమల పారిశ్రామికవేత్తలు భారత మార్కెట్‌లోకి ప్రవేశించేందుకు శ్రీసిటీని అనువైన వేదికగా పరిగణించాలని ఆయన సూచించారు. శ్రీసిటీలోని ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలను ఈ సందర్భంగా ప్రతినిధి బృందం ప్రశంసించింది. భారత్‌లో తమ వ్యాపార కార్యకలాపాలను విస్తరించాలనుకునే జపాన్ కంపెనీలకు శ్రీసిటీ ఆకర్షణీయమైన గమ్యస్థానమని అభిప్రాయపడింది. ఈ ప్రతినిధి బృందంలో ఎహిమే రాష్ట్ర ఆర్థిక, కార్మిక శాఖ, పారిశ్రామిక విధాన విభాగాలకు చెందిన సీనియర్ అధికారులు, చెన్నైలోని జపాన్ కాన్సులేట్ జనరల్ ప్రతినిధులు, జపాన్ నస్ కో లిమిటెడ్, సన్‌వెల్స్ కో లిమిటెడ్ సంస్థల వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీసిటీలో ఆదాయపు పన్నుపై అవగాహన



తిరుపతి ఆదాయపు పన్ను శాఖ ఆధ్వర్యంలో విదేశీ ఆస్తులు కలిగిన చిన్న పన్ను చెల్లింపుదారుల కోసం ప్రవేశపెట్టిన 'ఫారిన్ అసెట్స్ ఆఫ్ స్మాల్ ట్యాక్స్‌పేయర్స్ డిస్‌క్లోజర్ స్కీమ్' ఇటీవల శ్రీసిటీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ పథకం లక్ష్యాలు, అర్హతలు, విదేశీ ఆస్తులు, ఆదాయ వివరాల స్వచ్ఛంద వెల్లడికి అనుసరించాల్సిన విధానాలపై అధికారులు వివరించారు. ఆదాయపు పన్ను శాఖ ఉన్నతాధికారులు, ప్రతినిధులకు శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) సి.రమేష్‌కుమార్ స్వాగతం పలికారు. తిరుపతిలోని ఆదాయపు పన్ను శాఖ ప్రిన్సిపల్ కమిషనర్ కార్యాలయం అసిస్టెంట్ కమిషనర్ లోకేష్ మార్గదర్శకత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ లోకేష్ మాట్లాడుతూ విదేశీ ఆస్తులు, ఆదాయానికి సంబంధించి గతంలో వెల్లడించని కొన్ని వివరాలను అర్హులైన పన్ను చెల్లింపుదారులు స్వచ్ఛందంగా వెల్లడించి క్రమబద్ధీకరించుకునేందుకు ఈ పథకం అవకాశం కల్పిస్తుందని వివరించారు. వివరాలు వెల్లడించకపోవడం వల్ల ఎదురయ్యే చట్టపరమైన, ఆర్థికపరమైన పరిణామాలను కూడా తెలియజేశారు. ఆదాయపు పన్ను శాఖకు చెందిన నెల్లూరు అసిస్టెంట్ కమిషనర్ కె.కార్తికేయన్, ఆదాయపు పన్ను అధికారులు చైతన్య మోహన్, సునీల్ రామ్ పథకంలోని రెండు రకాల వెల్లడింపు విధానాలను వివరించారు.

జొన్నవాడలో విశేష పూజలు

నేత్రపర్వంగా 'కోటి సోమవారం'



కోటి సోమవారం పుణ్యదినం సందర్భంగా ఈనెల 16న జొన్నవాడ ఆలయానికి భక్తజనం వెల్లువలా తరలివచ్చారు. శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో అన్నాభిషేకం, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. పెద్దసంఖ్యలో ఆలయానికి వచ్చిన మహిళా భక్తులు కోటి సోమవారపు పూజలను దర్శించుకుని, ఆలయ ప్రాంగణంలో అత్యంత భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించారు. సాయంత్రం విశేషంగా స్వామివారికి జరిగిన అన్నాభిషేకాన్ని తిలకించి భక్తులు ఆనంద పరవశులయ్యారు. ఆలయ ఛైర్మెన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

ఇటలీ, ఈజిప్ట్

వాణిజ్య సదస్సుల్లో బీఎంఆర్



భారత్–ఇటలీ దేశాల మధ్య వాణిజ్య, పారిశ్రామిక మరియు పెట్టుబడుల సంబంధాలను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో ఇటీవల రోమ్‌లో నిర్వహించిన ఇండియా – ఇటలీ బిజినెస్ ఫోరంలో రాజ్యసభ సభ్యులు, బీఎంఆర్ గ్రూప్ ఛైర్మన్ డా. బీద మస్తాన్‌రావు యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌ని కలుసుకుని ఇరు దేశాల మధ్య వ్యాపార సహకారం, పెట్టుబడులు మరియు పారిశ్రామిక భాగస్వామ్యాలపై చర్చించారు. భారత రాయబారి వాణి రావు సమక్షంలో జరిగిన ఈ ఫోరంలో భారత, ఇటలీ దేశాలకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్తలు, వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు. భారత్‌లో ఆక్వాకల్చర్ రంగ ప్రగతి, రొయ్యల సాగు, ఉత్పత్తి సామర్థ్యం, సీఫుడ్ ప్రాసెసింగ్ మరియు ఎగుమతులలో భారతదేశం సాధించిన విజయాలను బీఎంఆర్ ఈ సందర్భంగా వివరించారు. ఈ పర్యటన ద్వారా భారతీయ ఆక్వాకల్చర్, సీఫుడ్ పరిశ్రమలకు యూరోపియన్ మార్కెట్లలో మరిన్ని అవకాశాలు కల్పించడంతో పాటు భారత్–ఇటలీ మధ్య వాణిజ్య సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని బీఎంఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. అదేవిధంగా, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ నేతృత్వంలో ఎఫ్ఐసీసీఐ మరియు భారత ప్రభుత్వ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ సంయుక్తంగా ఈజిప్ట్‌లో నిర్వహించిన సదస్సులో బీఎంఆర్ పాల్గొన్నారు. నవంబర్ 14 నుంచి 17 వరకు జరిగిన ఈ పర్యటన భారత్–ఈజిప్ట్‌ల మధ్య వాణిజ్య, పారిశ్రామిక మరియు పెట్టుబడుల సంబంధాల విస్తరణ లక్ష్యంగా జరిగిందని ఆయన తెలిపారు. కైరోలోని భారత రాయబార కార్యాలయంలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, ఈజిప్ట్‌లో భారత రాయబారి సురేష్ కె. రెడ్డితో కలిసి నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత్, ఈజిప్ట్ జూనియర్ బిజినెస్‌మెన్ అసోసియేషన్ల మధ్య ద్వైపాక్షిక వ్యాపార సహకార ఒప్పందం కుదిరిందన్నారు. ఆక్వాకల్చర్, రొయ్యల ఉత్పత్తి, సీఫుడ్ ప్రాసెసింగ్, ఎగుమతులు, ఆక్వా ఫీడ్ తయారీ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మరియు అంతర్జాతీయ మార్కెటింగ్ రంగాల్లో ఇరు దేశాల మధ్య వ్యాపార భాగస్వామ్యాలు, పెట్టుబడులు మరియు సాంకేతిక సహకార అవకాశాలను తాను చర్చించినట్లు బీద మస్తాన్‌రావు తెలియజేశారు.

గ్రంథాలయ వారోత్సవాల్లో..

ఆకట్టుకున్న కవిసమ్మేళనం



సత్కారాలందుకున్న కవులు, కవయిత్రులు

నెల్లూరు నగరంలోని కేంద్ర గ్రంథాలయంలో జరుగుతున్న గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఈనెల 18న కవిసమ్మేళనం అందరినీ ఆకట్టుకుంది. ప్రముఖ కవి, కళారత్న చిన్ని నారాయణరావు సారధ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 30 మంది కవులు పాల్గొని కవితాగానం చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ మేకపాటి శాంతికుమారి, కార్యదర్శి కుమారరాజా పాల్గొని కవులను సన్మానించారు. కవులు చిన్ని నారాయణరావుతో పాటు, చీమకుర్తి వెంకటేశ్వర్లు, అవ్వారు శ్రీధరబాబు, బొగ్గరపు రాధాకృష్ణమూర్తి, అన్నం శివకృష్ణ, రమేష్‌బాబు, ఇసనాక దయాకర్‌రెడ్డి, కుని అంకబాబు, కవయిత్రులు గోవిందరాజు సుభద్రాదేవి, ములుగు లక్ష్మీమైథిలి, వాయుగుండ్ల శశికళ, పార్లపల్లి నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ ఇంటర్నేషనల్‌కి..40 వసంతాలు

22న నగరంలో ర్యాలీ

'వాకర్స్ ఇంటర్నేషనల్' సంస్థకి 40 వసంతాలు పూర్తయిన సందర్భంగా ఈనెల 22న నెల్లూరులో వాకర్స్‌తో ర్యాలీ ప్రారంభిస్తామని జిల్లా వాకర్స్ అసోసియేషన్ 203–డిస్ట్రిక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు తెలిపారు. ఈ ర్యాలీ స్థానిక విఆర్‌సి గ్రౌండ్ నుండి నెహ్రూ బొమ్మ కూడలి, విఆర్‌సి సర్కిల్, గాంధీబొమ్మ సెంటర్ మీదుగా టౌన్‌హాలుకు చేరుకుంటుందన్నారు. ఈ సందర్భంగా మంచి ఆరోగ్యానికి నడక వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తనతోపాటు ప్రోగ్రామ్ ఛైర్మెన్ పి. శ్రీనివాసులురెడ్డి, నేతాజీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొంటారని, వాకర్స్ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ప్రశాంతమ్మ సమక్షంలో..

వైసీపీ నుండి టీడీపీలోకి దండిగా వలసలు



ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సమక్షంలో తెలుగుదేశంపార్టీలో చేరిన వైకాపా నాయకులు

కోవూరు నియోజకవర్గంలోని గ్రామాల్లో ఉన్న అనేకమంది వైసీపీ నాయకులు, వారి అనుచరులు ఇటీవల తెలుగుదేశం పార్టీలోకి వచ్చేస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కూటమి నేతల అభివృద్ధి పథకాలతో పాటు, ప్రశాంతమ్మ ప్రజలకు అందిస్తున్న సేవా కార్యక్రమాల పట్ల ఆకర్షితులై వారు టీడీపీలోకి వస్తుండడం విశేషం. ఇటీవల కొడవలూరు, విడవలూరు మండలాల్లో వైసీపీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. నెల్లూరులోని వీపీఆర్ కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రశాంతమ్మ సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. వైసీపీ నాయకులు దాసరి బాబూరావు, దాసరి వెంకటేశ్వర్లు, దాసరి దొరబాబు, బెల్లంకొండ శివకుమార్, దాసరి వెంకట రమణారెడ్డి తమ అనుచరులతో కలిసి టీడీపీలో చేరారు. వీరితోపాటు వారి అనుచరులకు చెందిన 30కి పైగా కుటుంబాలు కూడా తెలుగుదేశం పార్టీచేరాయి. అదేవిధంగా, విడవలూరు మండలం ఊటుకూరు పెద్దపాళెం గ్రామానికి చెందిన 20 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. టీడీపీ నాయకుడు మీనంగారి బాబు ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోడూరు వేణుగోపాల్‌రెడ్డి, కోడూరు నవీన్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కోవూరు మండలం పడుగుపాడుకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తల, వైసీపీకి చెందిన నాయకుడు రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి మిత్రమండలి ఆధ్వర్యంలో దాదాపు 150కి పైగా కుటుంబాలు టీడీపీలో చేరాయి.

ఇందుకూరుపేట మండలంలోని కొత్తూరుకు చెందిన ఎంపీటీసీ సభ్యులు, స్వతంత్ర అభ్యర్థి, వైసీపీ ముఖ్య నాయకులు తమ అనుచరులతో కలిసి ప్రశాంతిరెడ్డి సమక్షంలో ఈనెల 15న తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎంఎస్ఎంఈ రాష్ట్ర డైరెక్టర్ వీరేంద్రనాయుడు, టీడీపీ ముఖ్య నాయకులు కళ్యాణ్‌రెడ్డి, ఇందుకూరుపేట మండలాధ్యక్షులు పవన్‌కుమార్‌రెడ్డి, వేగూరు శివకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. ఇందుకూరుపేట స్వతంత్ర సభ్యులు ఆల్తూరు వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు భీమవరపు వెంకట కృష్ణారెడ్డి, వైసీపీ నాయకులు గండవరపు రామిరెడ్డి, మద్దాల రమేష్‌రెడ్డి, ఈగ విజయమ్మ, మాణిక్యాల నిర్మలమ్మ తమ అనుచరులతో కలిసి పార్టీలో చేరారు. వైసీపీ సీనియర్ నాయకులు బట్టేపాటి నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో 11 పంచాయతీలకు చెందిన ముఖ్య నాయకులు పాల్గొన్నారు. వైసీపీ మాజీ ఎంపీటీసీ అప్పాణి నాగభూషణం, వైసీపీ రైతు విభాగం జనరల్ సెక్రటరీ బట్టేపాటి కరుణాకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ హంసవీణమ్మ, రమణయ్య దంపతులు, లేబూరు ఎంపీటీసీ వేణుంబాక శరణ్య టీడీపీలో చేరారు. అలాగే, దామర మడుగు, గుంటకట్ట గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు తెదేపాలో చేరారు.

'కాటంరెడ్డి' సేవలు చిరస్మరణీయం

- జయంతి సభలో వక్తలు



అల్లూరుకు చెందిన దివంగత నేత కాటంరెడ్డి ఆదినారాయణరెడ్డి సేవలు చిరస్మరణీయమని, జిల్లాలో రక్తదాన ఉద్యమ వ్యాప్తికి ఆయనెంతగానో కృషిచేశారని వక్తలు కొనియాడారు. కావలిలోని రెడ్‌క్రాస్ భవన్‌లో ఇటీవల ఆదినారాయణరెడ్డి 95వ జయంతి వేడుకలు జరిగాయి. తొలుత, ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షుడు బెజవాడ రవికుమార్ మాట్లాడుతూ, జిల్లాలో రక్తదానంపై సరైన అవగాహన లేని కాలంలోనే కాటంరెడ్డి ఆదినారాయణరెడ్డి 60సార్లు రక్తదానం చేయడం గొప్ప విశేషమన్నారు. అదేవిధంగా ఆయన కుమారుడు.. మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి కూడా తండ్రి ఆశయాల బాటలో నడుస్తున్నారని ఆయన కొనియాడారు. కావలి రెడ్‌క్రాస్ ఛైర్మెన్ రవిప్రకాష్, వైస్‌ఛైర్మెన్ హరి నారపరెడ్డి, కార్యదర్శి బీఎస్ ప్రసాద్, ముళీరెడ్డి, శ్రీహరిరెడ్డి పాల్గొన్నారు.

ధ్రువకుమార్‌కి..గజల్ శ్రీనివాస్ సత్కారం



ఆంధ్ర సారస్వత పరిషత్ విశ్వసాహితి కళావేదిక వారు నెల్లూరు టౌన్‌హాలులో ఈనెల 18న నిర్వహించిన సింహపురి బాలల సాహిత్య సాంస్కృతిక సంబరాలలో ధ్రువకుమార్ వేమన పద్యాలు, భగవద్గీత శ్లోకాలు అద్భుతంగా వినిపించి ముఖ్యఅతిథి ప్రముఖ గాయకుడు గజల్ శ్రీనివాస్‌చే సన్మానం అందుకున్నాడు. ధ్రువకుమార్ నెల్లూరులోని సెయింట్ జోసఫ్ స్కూల్‌లో 2వ తరగతి చదువుతున్నాడు.

'వేద విజ్ఞాన వేదిక'

సాహిత్య కార్యక్రమం..29న

చెన్నైలోని 'వేద విజ్ఞాన వేదిక' ఆధ్వర్యంలో తరతరాల తెలుగు కవిత ప్రత్యేక కార్యక్రమం ఈనెల 29 ఆదివారం సాయంత్రం 6.30గంటలకు నిర్వహించనున్నట్లు వేదిక అధ్యక్ష కార్యదర్శులు జెకె రెడ్డి, కందనూరు మధు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తమిళనాడు క్రీడాభివృద్ధి అథారిటీ సీఇఓ మరియు మెంబర్ సెక్రటరీ జె.మేఘనాథరెడ్డి, ప్రముఖ సినీకవి భువనచంద్ర, ప్రసిద్ధ శాస్త్రీయ సంగీత గాయని ఎస్‌కె మహతి పాల్గొంటారని వారు పేర్కొన్నారు. చెన్నై, ఆంధ్రాక్లబ్‌లో జరిగే ఈ కార్యక్రమానికి సాహిత్యాభిమానులు తరలివచ్చి జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఆకట్టుకుంటున్న..దారపు దేవాలయాలు

శివశంకర్ ప్రతిభ





కళాత్మక హృదయం, కృషి-పట్టుదల ఉండాలే గానీ, ఎంతటి కళాఖండాన్నయినా సృష్టించవచ్చనేందుకు నెల్లూరుజిల్లాకి చెందిన ఓ ఉపాధ్యాయుడు నిదర్శనం. కేవలం దారంతోనే ఆయన అద్భుతాలు సృష్టిస్తున్నారు. తాజాగా ఆయన దారంతోనే రూపొందించిన ఆలయాలు, మండపాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ప్రముఖ దారపు శిల్పిగా పేరు పొందిన ఆయన మరెవరో కాదు.. అనంత సాగరం మండలం చిలకలమర్రి ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న డా. శివశంకర్ మాస్టారు. అనేక డిగ్రీలు పొందిన విద్యావేత్త ఆయన. మొదట్లో చిత్రలేఖనంతో ప్రారంభమైన ఆయన కళ, ఆ తర్వాత దారపుచిత్రాలుగా ప్రసిద్ధి పొందింది. అనేక దేవతామూర్తుల దారపుచిత్రాలను అద్వితీయంగా చేసి జాతీయ, అంతర్జాతీయస్థాయిలో ఎన్నో అవార్డులు, ప్రముఖుల ప్రశంసలు అందుకున్నారాయన. తనకున్న ఖాళీ సమయాన్ని వృధా చేయకుండా ఆయన ఈ కళలోనే నిమగ్నమవుతుంటారు. ఆ కళని, ఆసక్తి ఉన్న విద్యార్థులకు ఆయన నేర్పిస్తున్నారు. అరుదైన కళలో ఆయన ప్రసిద్ధులై జిల్లాకు ఖ్యాతి తెస్తున్నారు.

ఏకగ్రీవ పంచాయతీలకి..

భారీ ప్రోత్సాహకాలు

- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ పంచాయతీలకు అందించే ఆర్థిక ప్రోత్సాహక నగదు పారితోషికాన్ని భారీగా పెంచుతూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులిచ్చింది. తాజా ఆదేశాల మేరకు, 2026 సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ పదవితో పాటు గ్రామ పంచాయతీలోని అన్ని వార్డు సభ్యుల స్థానాలు ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ పంచాయతీలకు జనాభా ప్రాతిపదికన భారీగా ప్రోత్సాహక నగదు పారితోషికాలు అందించనున్నామని జిల్లాల్ల కలెక్టర్ హిమాన్షు శుక్ల ఒక ప్రకటనలో తెలిపారు. 5వేల లోపు జనాభా కలిగిన గ్రామ పంచాయతీలకు రూ.15 లక్షలు. 5 నుంచి 10వేల వరకు జనాభా కలిగిన గ్రామ పంచాయతీలకు రూ.25 లక్షలు. 10 వేలకంటే ఎక్కువ జనాభా కలిగిన గ్రామ పంచాయతీలకు రూ.50 లక్షల వంతున ప్రోత్సాహకాలు అందించనున్నట్లు ఆయన వెల్లడించారు.

శిశుగృహంలోని చిన్నారి దత్తత

నెల్లూరు నగరంలోని శిశుగృహంలో సంరక్షణ పొందుతున్న ఓ చిన్నారిని ఒడిశా రాష్ట్రానికి చెందిన దంపతులు దత్తత తీసుకున్నారు. కలెక్టరేట్‌లో ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆ దంపతులకు చిన్నారికి సంబంధించిన చట్టబద్ధ దత్తత ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దత్తత తీసుకున్న చిన్నారికి ప్రేమ, ఆప్యాయతలతో కూడిన కుటుంబ వాతావరణాన్ని కల్పిస్తూ, మంచి విద్యను అందించి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని దంపతులకు సూచించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్.నాగశైలజ, జిల్లా బాలల సంరక్షణ అధికారి సురేష్, శిశుగృహ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జయభారత్' ఆసుపత్రిలో 'బ్లడ్‌బ్యాంక్' ప్రారంభం



రక్తదానం చేస్తున్న యువత

నెల్లూరు నగరంలోని వీఆర్‌సి సెంటర్ సమీపంలో సింహపురి వైద్యసేవా సమితి వారి ఆధ్వర్యంలోని 'జయభారత్' ఆసుపత్రిలో రోగుల, బాధితుల అవసరాల కోసం ఈనెల 16న బ్లడ్‌బ్యాంక్ (రక్తనిధి)ని ఏర్పాటుచేశారు. జిల్లా వైద్యారోగ్యశాఖ డిప్యూటి డీఎంఅండ్‌హెచ్ఓ ఖాదర్‌వలీ ఈ రక్తనిధికి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జయభారత్ ఆసుపత్రి యాజమాన్యం వారు సేవాదృక్పథంతో ఈ ఆసుపత్రిలో అతితక్కువ ఖర్చుతోనే వైద్యసేవలు అందించడాన్ని అభినందించారు. అమృత శ్రీనివాసం లయన్స్‌క్లబ్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మెన్ శ్రీనివాసులు, ట్రస్ట్ కార్యదర్శి శ్రీరాములు, కోశాధికారి రామనుజన్, కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

లావణ్య లహరికి..గోల్డ్‌మెడల్



గోల్డ్‌మెడల్ అందుకుంటున్న లావణ్య లహరి

నెల్లూరు ధనలక్ష్మీపురానికి చెందిన ఇనమనమెళ్ళూరి లావణ్య లహరికి ఇటీవల కర్నాటకలోని సూరత్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ బంగారు పతకాన్ని బహుకరించింది. నెల్లూరులో టెన్త్, ఇంటర్ పూర్తిచేసిన ఆమె, తిరుపతిలో బీటెక్ పూర్తి చేశారు. ఆ తర్వాత సూరత్‌లో విశ్వ విద్యాలయంలో ఎంటెక్(నానో టెక్నాలజీ)లో చేరారు. ఎంటెక్‌లో ఉత్తమ ఫలితాలు సాధించినందుకు ఆ విశ్వవిద్యాలయం వారు ఆమెను అభినందించి మెరిట్ సర్టిఫికెట్‌తో పాటు గోల్డ్‌మెడల్ అందజేశారు

'గురునిలయం'లో..దుప్పట్ల పండుగ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న రామచంద్ర

నెల్లూరు మూలాపేటలోని గురు నిలయంలో ఉన్న భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి వారి మందిరంలో, మాకాని వెంకట్రావు స్వామి కుటుంబసభ్యులు ఈనెల16న దుప్పట్ల పండుగ నిర్వహించి, అనేకమంది పేదలకు దుప్పట్లు పంపిణీచేశారు. గత 22 సంవత్సరాలుగా వారు ప్రతి శీతాకాలంలో చలికి బాధలుపడుతున్న నిరుపేదలకు దుప్పట్లు పంచుతున్నారు. హైకోర్టు సీనియర్ న్యాయవాది రామచంద్ర, హైదరాబాద్‌కి చెందిన భక్తుడు పెంచలయ్య, విద్యుత్‌శాఖ మాజీ అధికారి ధనుంజయ, గురునిలయం ఆశ్రమ నిర్వాహకులు మాకాని గోపి తదితరుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.

జైజై ఎన్టీఆర్ జైజై బీజేపీ జైజై తెలుగుదేశం జైజై జనసేన



వందనం - కృతజ్ఞతాభివందనం!



మాకు రాజకీయంగా ఒక మంచి అవకాశం కల్పించి దీవించిన
గౌరవ ముఖ్యమంత్రివర్యులు **శ్రీ నారా చంద్రబాబునాయుడు** గారికి,
మంత్రివర్యులు **శ్రీ నారా లోకేష్** గారికి, ఉప ముఖ్యమంత్రి **శ్రీ పవన్ కళ్యాణ్** గారికి
మా ధన్యవాదాలు.



మా అమ్మ **శ్రీమతి షకీలా** గారిని గౌరవంగా పార్టీలోకి ఆహ్వానించి, సముచిత స్థానం కల్పించి,
మాకు కొండంత అండగా వుంటూ.. మా ముందుండి మమ్మల్ని నడిపించిన మా మార్గదర్శి
మంత్రివర్యులు **శ్రీ ఆనం రామనారాయణరెడ్డి** గారికి
మా ప్రత్యేక అభివందనాలు.

బలమైన తమ ఆశీస్సులతో **డాక్టర్ షకీలా** గారితో పాటుగా
కూటమి అభ్యర్థులందరిని గెలిపించిన ఆత్మకూరు పట్టణ ఓటరు మహాశయులకి,
పార్టీ విజయం కోసం క్షణక్షణం కష్టపడిన మూడు పార్టీల నాయకులకి, కార్యకర్తలకి
డాక్టర్ బిఎస్ఆర్ కుటుంబ అభిమానులకి **మా కృతజ్ఞతాభివందనాలు.**



సేవా వారసత్వం!

మా తాతయ్య స్వర్గీయ **డాక్టర్ బొమ్మిరెడ్డి సుందరరామిరెడ్డి** గారు
1963లో ఆత్మకూరులో వైద్యసేవకు శ్రీకారం చుట్టారు.
అనంతరం సమాజసేవే తమ లక్ష్యంగా రాజకీయాలలోకి ప్రవేశించారు.
మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి విద్య, వైద్యం, ఇళ్ళు, రోడ్లు, తాగునీరు, సాగునీరు,
విద్యుత్ వంటి సదుపాయాలకి ప్రాధాన్యత కల్పించి తమ శ్రమని అభివృద్ధిగా మలిచారు.


ఆ సేవా పరంపరని వారి కుమారుడు మా నాన్న **డాక్టర్ రవి** గారు కొనసాగించారు.
తానొక సర్జన్‌గా ఓవైపు పేదల ప్రాణాలు కాపాడుతూ, మరోవైపు గ్రామ సర్పంచ్‌గా
పట్టణానికి తాగునీటి పథకం, రోడ్లు, ఇంటింటికీ కుళాయి వంటివి సాధించారు.

ఇప్పుడు మా అమ్మ **డాక్టర్ బొమ్మిరెడ్డి షకీలా** గారిని ఆత్మకూరు ప్రజలు
ఆదరించి, అభిమానించి మునిసిపల్ ఛైర్‌పర్సన్‌గా అఖండ మెజారిటీతో గెలిపించారు.

ఆత్మకూరు ప్రజలు మాపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము కానీయకుండా,
మా పెద్దలు మాకందించిన సేవా వారసత్వాన్ని కొనసాగిస్తూ,
ఆత్మకూరు అభివృద్ధి కోసం దృఢమైన సంకల్పంతో ముందుకు సాగుతాం.

ఆత్మకూరు ప్రగతే లక్ష్యంగా..
ఆత్మకూరు అభివృద్ధే ఆశయంగా..
ఆత్మకూరు సంక్షేమమే శ్వాసగా..
ఆత్మకూరుతో పాటు పరిసర ప్రాంతాలలో సైతం
ప్రతి ఇల్లు, ప్రతి గడప, ప్రతి కుటుంబం
సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో,
అష్టైశ్వర్యాలతో వర్ధిల్లేలా మావంతు సేవలు
అందిస్తామని మనసా వాచా కర్మణా
ప్రమాణం చేస్తూ హామీ ఇస్తున్నాం.

ఇట్లు,
బొమ్మిరెడ్డి తారకనాథ్‌రెడ్డి



ప్రమాణస్వీకారోత్సవ శుభాకాంక్షలు



గత 40 సంవత్సరాలుగా తమ వైద్య సేవలతో
ఆత్మకూరుతో పాటు పరిసర గ్రామాల ప్రజల
అపార అభిమానాన్ని పొంది, నేడు ఆత్మకూరు పట్టణవాసుల
అపూర్వ ఆశీస్సులతో, ఆత్మీయ ఆదరణతో
ఆత్మకూరు మునిసిపల్ చరిత్రలో తొలిసారిగా,
ప్రజలే నేరుగా ఎన్నుకున్న తెలుగుదేశం ఛైర్‌పర్సన్‌గా ఎన్నికై,
ఆత్మకూరు అభివృద్ధే ధ్యేయంగా
నవంబర్ 23న బాధ్యతలు చేపట్టబోతున్న
డాక్టర్ బొమ్మిరెడ్డి షకీల గారికి
మా అభినందన శుభాకాంక్షలు.

బొమ్మిరెడ్డి కుటుంబ అభిమానులు
ఆత్మకూరు పురపౌరులు

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com